# ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 04.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 285 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



న్యూజిలాండ్ సిరీస్‌కు భారత జట్టు ఖరారు 8

# విద్య, వైద్యం, సాగునీటిపై నిర్లక్ష్యం

## ప్రభుత్వాల వైఫల్యమే ప్రజల ఇబ్బందులకు కారణం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్/ సూర్యాపేట, జనవరి 3:** విద్య, వైద్యం, సాగునీరు, రోడ్లు వంటి మౌలిక రంగాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజల అవసరాల కోసం పోరాటం ఆగదని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జనం బాట కార్యక్రమంలో ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. విద్య, వైద్యం, సాగునీరు, రోడ్లు, మార్కెట్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి మౌలిక రంగాల్లో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆమె తీవ్రంగా విమర్శించారు. ప్రజల అవసరాల కోసం పోరాటం చేయడమే లక్ష్యంగా తెలంగాణ జాగృతి పనిచేస్తుందని స్పష్టం చేశారు. సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా

...:: మిగతా 2లో

“

తెలంగాణ నీళ్లు, అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం ఏకాభిప్రాయంతో పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడతామని ప్రకటించారు. “చచ్చినా తెలంగాణ కోసం చస్తాం.. బ్రతికినా తెలంగాణ కోసమే బ్రతుకుతాం. దేవుడి మీద ఆన – నేను ఉన్నంత కాలం తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీయను” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.



# దేవుడి మీద ఆన

## నేనున్నంత వరకు తెలంగాణ హక్కులకు భగం కలుగనీయ

- చర్చకు రమ్మంటే పారిపోయారు
- కృష్ణా జలాలపై చరిత్రను వక్రీకరించారు
- కృష్ణా, గోదావరి జలాలపై సభలో చర్చకు రండి
- శాసనసభే రాష్ట్ర ప్రయోజనాల పరమావధి
- ప్రతిపక్షానికి సీఎం రేవంత్ రెడ్డి సవాల్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జనవరి 3:** వలసల జిల్లా పాలమూరు బిడ్డగా కరువు కష్టాలు, పేదరికం ఏమిటో తనకు పూర్తిగా తెలుసునని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని, ఇందుకు కాంగ్రెస్ కారణమంటూ కేసీఆర్ చేసిన విమర్శలు వాస్తవ విరుద్ధమని ఆయన శాసనసభలో తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ఎలా ఉపయోగపడతాయో, తమ అనుభవంతో సూచనలు ఇస్తారని భావించి కృష్ణా జలాలపై ఒకరోజు, గోదావరి జలాలపై మరో రోజు సభలో చర్చిద్దామని ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించామని సీఎం తెలిపారు. అయితే సభకు రాకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. శాసనసభకు ఒక పవిత్రత ఉందని, ఇక్కడ జరిగే చర్చలను ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో నమ్ముతారని సీఎం గుర్తు చేశారు. అబద్ధాలకు, మాటల గారడీలకు ఈ సభలో చోటు లేదని స్పష్టం చేశారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమే శాసనసభ అని, ఇక్కడ మాట్లాడే ప్రతి మాట రాష్ట్ర ప్రయోజనాలకే అంకితమై ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. గత రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రావడం లేదని, పదే పదే విజ్ఞప్తి చేసినా 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే నేత చర్చకు దూరంగా ఉన్నారని విమర్శించారు. సభలోకి

...:: మిగతా 2లో



### కాంగ్రెస్... టీవీకే పొత్తు?!

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపే అవకాశాలున్నాయని నటుడు విజయ్ పార్టీ సంకేతాలు ఇచ్చింది. లౌకికవాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్-టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ చెప్పారు.

7




### భారీ పేలుళ్లతో దద్దరిల్లిన వెనెజువెలా..

అమెరికా, వెనెజువెలా దేశాల మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరాయి. తాజాగా భారీ పేలుళ్లతో వెనెజువెలా దద్దరిల్లింది. రాజధాని కరాకస్ లో పేలుళ్లు సంభవించాయి. శనివారం దాదాపు ఏడు చోట్లు పేలుడు శబ్దాలు వినిపించాయి.

7

# ఒక్క నీటి చుక్కనూ వదలం



- పదేళ్లలో నూతన ప్రాజెక్టులకు వేల కోట్లు ఖర్చు
- ఒక్క ఎకరాకు నీరు పారలే
- కేసీఆర్, హరీశ్ రావుల ఒప్పందంతోనే రాష్ట్రానికి అన్యాయం
- శాసనసభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జనవరి 3:** కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని శాసనసభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు.తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో

...:: మిగతా 2లో



# దండకారణ్యంలో ఎదురు కాల్పులు
# తెలంగాణలో లొంగుబాట్లు

- బస్తర్ లో భారీ ఎన్‌కౌంటర్
- 14 మంది నక్సలైట్ల మృతదేహాలు స్వాధీనం
- లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత దేవా
- డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 20మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**ఉత్తర తెలంగాణ, జనవరి3:** ఒక పక్క దండకరణ్యంలో ఎదురు కాల్పులు జరుతుండగా 14 మంది మావోయిస్టులు మరణించగా, మరో పక్క తెలంగాణ లో లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. బస్తర్ రేంజ్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల సమయంలో భద్రతా దళాలు మొత్తం 14 మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి.బీజాపూర్ జిల్లా నుండి ఇద్దరు మరియు సుక్మా జిల్లా నుండి 12 మంది 14 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున

...:: మిగతా 2లో



### కాంగ్రెస్‌లో చేరిన టీఎంసీ ఎంపీ మౌసమ్ నూర్

పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ మౌసమ్ నూర్ గుడ్ బై చెప్పారు. శనివారం కాంగ్రెస్ పార్టీలో ఆమె చేరారు.

7



### అంజన్న ఆశీస్సులతోనే
# నాకు పునర్జన్మ

- కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- టీటీడీ నిధులతో వసతి గదులు, ధర్మశాల నిర్మాణానికి భూమిపూజ
- తెలంగాణలోనూ మొదలు పెడదాం: జనసేన కార్యకర్తలతో పవన్

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో

**జనవరి 3:** ఏపీ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ. 35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి పవన్ కల్యాణ్ భూమి పూజ చేశారు. పవన్ కల్యాణ్ తోపాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా

...:: మిగతా 2లో



### బీడు భూములకు
# భరోసా కట్!

- పంటలు వేసే భూములకే చెల్లింపులు
- ప్రభుత్వ ఆలోచన!

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, జనవరి 3:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా పథకంలో మార్పులు చేసింది. యాసంగి సీజన్‌కు సంబంధించి, రైతు భరోసా నిధులను సంక్రాంతికి విడుదల చేయబోతున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. అయితే గత ప్రభుత్వం రైతులందరికి రైతు బంధు ఇవ్వగా.. పంటలు పండించని వారు కూడా రైతు బంధు తీసుకొంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు చేసింది. దీంతో అధికారంలోకి

...:: మిగతా 2లో



# ఇష్టారాజ్యంగా హైదరాబాద్ విభజన

## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫైర్

- సికింద్రాబాద్ చరిత్రను నాశనం చేసే కుట్ర
- గూగుల్ మ్యాప్ ఆధారంగా మహానగర విభజనా?
- జంట నగరాల ఉనికిని చెరిపే ప్రయత్నం
- మహానగర విభజనపై న్యాయపోరాటం చేస్తాం
- 17న సికింద్రాబాద్‌లో భారీ ఆందోళనకు పిలుపు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, జనవరి 3:** హైదరాబాద్ మహానగరాన్ని శాస్త్రీయ అధ్యయనం లేకుండా, ఇష్టారాజ్యంగా విభజిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు

...:: మిగతా 2లో



### వంద కోట్ల స్కామ్.. మమత ప్రభుత్వంపై బీజేపీ ఆరోపణ

వరద బాధితులకు అందించాల్సిన సాయంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం రూ.100 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సోషల్ మీడియా వేదికగా బీజేపీ ఆరోపించింది.

7

రాజకీయం

# ఇష్టారాజ్యంగా హైదరాబాద్ విభజన

మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా విమర్శించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనసభ విప్ కేపీ వివేకానంద గౌడ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందని, ముఖ్యంగా సికింద్రాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని తలసాని పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా నగరాన్ని విభజించినట్లుగా ఉందని విమర్శించారు. టెక్నికల్ స్టడీ లేకుండా, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోకుండా విభజన చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. మహానగర విభజనకు వ్యతిరేకంగా ఈ నెల 17న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సహా పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసనలు తెలియజేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. "ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూపండి" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని తలసాని సవాల్ చేశారు. మహానగర విభజనపై కాంగ్రెస్ నాయకులకు కనీస అవగాహన లేదని, డివిజన్లను కూడా సరిగా విభజించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పరిపాలన సౌలభ్యం కోసం 150 డివిజన్లు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. శాసనసభ విప్ కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల మనోభావాలు పట్టడం లేదని, అనుభవరాహిత్యంతో రాష్ట్రాన్ని గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. "కుక్కలు చించిన విస్తరిలా హైదరాబాద్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒక్క మంత్రి కూడా లేదని, విభజనపై మేయర్, ఉప మేయర్, కార్పొరేటర్లతో సంప్రదింపులు జరపలేదని విమర్శించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో కూడా సమగ్ర చర్చ లేకుండానే దొంగచాటుగా మహానగర విభజన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారని ఆరోపించారు.

# దేవుడి మీద ఆన

మొదటిపేజీ తరువాయి

రాకుండా బయట నుంచి వ్యాఖ్యలు చేయడం చట్టసభలను అవమానించడమేనని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కృష్ణా జలాలపై చరిత్రను వక్రీకరించారు**

ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ ప్రాంతంలో వీలైనన్ని సాగునీటి ప్రాజెక్టులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సీఎం వివరించారు. 2005 నుంచి 2014 మధ్య కృష్ణా బేసిన్‌లో ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరురంగారెడ్డి, డిండి, మక్తల్-నారాయణపేట-కొడంగల్, కోయిల్ సాగర్ వంటి కీలక ప్రాజెక్టులు చేపట్టామని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిని వేగంగా పూర్తి చేయాల్సిందిపోయి, అసంపూర్తిగా వదిలేసిందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు 490 టీఎంసీలు కేటాయిస్తే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్, హరీష్‌రావు బాధ్యతలు చేపట్టాక తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగిందని సీఎం విమర్శించారు. 2015 జూన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో 299 టీఎంసీలకే అంగీకరించి సంతకం పెట్టారని, 2016 అపెక్స్ మీటింగ్‌లోనూ ఇదే తాత్కాలిక వాటాలకు ఒప్పుకున్నారని, 2020లో జరిగిన రెండో అపెక్స్ మీటింగ్‌లోనూ అదే కేటాయింపులను శాశ్వతంగా అంగీకరించారని వివరించారు.

**సభలో చర్చకు రాకుండా పారిపోయారు**

కృష్ణా జలాలపై బహిరంగ సభలు కాదు, శాసనసభలోనే చర్చిద్దామని కేసీఆర్, హరీష్ రావులను ఆహ్వానించినా వారు రావడం లేదని సీఎం ఆరోపించారు. పదేళ్లపాటు ఏపీకి కృష్ణా నీరు తరలించుకుపోయేందుకు సహకరించి తెలంగాణకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు చరిత్ర పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం 2009లో అప్పటి ఎంపీ విఠల్ రావు, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి లేఖ రాశారని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర నాయకులతో పోరాడి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఈ ప్రాజెక్టును సాధించారని తెలిపారు. ఆ సమయంలో మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్న కేసీఆర్ ఈ ప్రాజెక్టు కోసం డిమాండ్ చేయలేదని గుర్తుచేశారు. జూరాల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 70 టీఎంసీల వరద జలాలను మళ్లించి సాగునీరు అందించేందుకు ఉమ్మడి రాష్ట్రం ఆమోదం తెలిపిందని, సర్వే, డీపీఆర్ బాధ్యతలను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు అప్పగించిందన్నారు. అయితే తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి వ్యయాన్ని పెంచిందని విమర్శించారు. జూరాల వద్ద పంపులకు రూ.5,185 కోట్లు అంచనా ఉంటే, సోర్స్ మార్పుతో 37 పంపులకు రూ.10,335 కోట్లకు అంచనాలు పెరిగాయని తెలిపారు.

# కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్



**ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 3:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కిషన్‌రెడ్డి. ట్వీట్ పెట్టారు. మోదీపై కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పుకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని తెలిపారు. మోదీపై వ్యాఖ్యలకు గానూ కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంపై వెంటనే జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# ఒక్క నీటి చుక్కనూ వదలం

మొదటిపేజీ తరువాయి

దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు.

**పాలమూరు 35శాతమే పూర్తి...**

పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ కూడా అదనంగా పెంచారని.. అదే సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో టీఎంసీలను తగ్గించారని మండిపడ్డారు.

**త్వరలో బ్రిజేష్ కుమార్ తీర్పు...**

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి తెలిపారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నానని, కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 72 శాతం వరకు నీటి కేటాయింపులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తెలంగాణకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మొత్తం 814 టీఎంసీల కృష్ణా నీళ్లను తెలంగాణ, ఏపీకి న్యాయంగా కేటాయించాలన్నారు. తెలంగాణకు కృష్ణా నదిలో 72 శాతం వాటా కావాలని వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేటాయించిన 45 టీఎంసీల నీళ్లనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని కూడా మించిపోయిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2016లో అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి కేసీఆర్ హాజరై 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని.. తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 511 టీఎంసీల నీటి కేటాయింపులపై ఒప్పందాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణకు 71 శాతం, ఏపీకి 29 శాతం కృష్ణా నీటి వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సిందే:**
**మంత్రి శ్రీధర్ బాబు**

ఈ చర్చలో మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొని మాట్లాడుతూ.. నదీ జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించేందుకే సభలో లఘు చర్చను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇలాంటి కీలకమైన అంశంపై బీఆర్ఎస్ సభకు హాజరుకాకపోవడం సరైనది కాదని వ్యాఖ్యానించారు. నదీ జలాల అంశంపై ప్రజలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు

# బీడు భూములకు భరోసా కట్!

మొదటిపేజీ తరువాయి

వచ్చినప్పటి నుంచి దీనిపై కసరత్తు ప్రారంభించింది. చాలా మంది రైతులు తమ పొలాలను కౌలుకు ఇస్తున్నారు. దాని ద్వారా కౌలు డబ్బులు పొందుతున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి రైతు భరోసా పథకాన్ని కూడా పొందడంతో వారు ఆర్థికంగా చాలా లబ్ధిపొందుతున్నారు. కానీ చాలా మంది చిన్నా సన్నకారు రైతులు నష్టపోతున్నారని రేవంత్ సర్కార్ భావించింది. అందుకోసం రైతు భరోసా అమలులో కీలక మార్పులు చేసింది. ఇకపై పంటలు పండిస్తున్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందనుంది. దీనివల్ల సుమారు 10 లక్షల ఎకరాలకు రైతు భరోసా కట్ కాబోతుంది. సాగు చేసే రైతులకు మాత్రమే పథకాన్ని ఇవ్వడం ద్వారా సాగును ప్రోత్సహించటంతో పాటు.. బీడు భూములకు పథకం నుంచి తీసివేయడం ద్వారా ప్రభుత్వంపై భారాన్ని కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. రైతు భరోసాపై గతంలో సీఎం మాట్లాడుతూ.. ఇకపై రైతు భరోసా నిధులను కేవలం సాగు చేసే భూమికే అందించాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే సాగులో లేని భూములకు పెట్టుబడి సాయం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఇటీవల ప్రభుత్వం చేసిన సర్వేలో కొండలు, కమర్షియల్ ప్లాట్లు ఉన్నవారికి కూడా పథకం ద్వారా లబ్ది పొందుతున్నట్లు తేలగా.. ప్రభుత్వం దీనిపై చర్యలకు ఉపక్రమించింది. 65లక్షల మంది అర్హులు.. "రైతులకు ప్రభుత్వం తీపి కబురు, సంక్రాంతి కంటే ముందే ఖాతాల్లో నిధులు జమ..!!" సింథటిక్ ఎపర్చర్ రాడార్ ఏజెన్సీ సాయంతో శాటిలైట్ మ్యాపింగ్ చేస్తున్నారు. అయితే ఇది ప్రస్తుతానికి వాయిదా పడింది. వర్షాకాలంలో ఇచ్చినట్లు గానే యాసంగిలో కూడా ఇస్తామని చెబుతున్నారు. కాగా సంక్రాంతికి రైతు భరోసా డబ్బులు రిలీజ్ చేయనుండగా 65లక్షల మంది అర్హులున్నట్లు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రైతు బంధు పేరును రైతు భరోసాగా మార్చి.. ఎకరాకు రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తుంది.

**క్షేత్రస్థాయిలో సర్వే..**

అసలైన అన్నదాతలకే రైతు భరోసా దక్కాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీఆర్ఎస్ హయాం నుంచి కొండలు, కమర్షియల్ ప్లాట్లు ఉన్నవారికీ సాయం అందుతోందని తేల్చింది. వారికి చెక్ పెట్టేలా శాటిలైట్ మ్యాపింగ్ చేపట్టింది. సింథటిక్ ఎపర్చర్ రాడార్ ఏజెన్సీ సాయంతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి అనర్హులను గుర్తిస్తున్నారు. కాగా సంక్రాంతికి రైతు భరోసా డబ్బులు రిలీజ్ చేయనుండగా 65లక్షల మంది అర్హులున్నట్లు తెలిపింది.

# దండకారణ్యంలో ఎదురు కాల్పులు.. తెలంగాణలో లొంగుబాట్లు

మొదటిపేజీ తరువాయి

ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ మరియు సుక్మా జిల్లాల దక్షిణ ప్రాంతాలలో సాయుధ మావోయిస్టుల ఉనికి గురించి విశ్వసనీయ సమాచారం ఆధారంగా, భద్రతా దళాలు శోధన ఆపరేషన్ ప్రారంభించాయి. ఇదిలా ఉండగా తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 20మంది మావోయిస్టుల లొంగుపోయారు. ప్రస్తుతం మావోయిస్టు లు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది, డీజీపీ శివధర్ రెడ్డి లొంగిపోయిన మావోయిస్టులను ఈరోజు మూడు గంటలకు మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.బర్సే దేవాతో పాటు 20 మంది మావో యిస్టులు లొంగిపోయినట్లు తెలుస్తోంది. బర్సే దేవాల లొంగుబాటు,ఆపరేషన్ కగార్ మావోయిస్టులో కీలక మార్పులు తీసుకువచ్చింది. మావోయిస్టులు ఒక్కొక్కరి గా బయటకు వస్తున్నారు. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. ఇందులో భాగంగా శనివారం మావోయిస్టు పార్టీ కీలక నేత బర్సే దేవా, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారని, పోలీస్ అధికారులు తెలిపారు. మావోయిస్టు అగ్రనేతగా ఉన్న బర్సే దేవా మావోయిస్ట్ పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తున్న సంగతి తెలిసిందే.హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీలో కీలకపాత్ర పోషించిన దేవా, సాయుధ బలగాల వ్యవహారాలను చూసేవారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవా మావోయిస్టులకు ఆయుధాల సరఫరాలో కీలక పాత్ర పోషించినట్లు డీజీపీ మీడి యాకు వెల్లడించనున్నారు.

**మిగిలింది ఇక17 మందే: డీజీపీ**

మావోయిస్టుల లొంగుబాటుకు సంబంధించి తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. శనివారం డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ గెరిల్లా ఆర్మీ ముఖ్య నాయకుడు బడ్సే సూక్కా అలియాస్ దేవాతో పాటు 17 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు. వీరితో పాటు.. తెలంగాణకు చెందిన రాజి రెడ్డి, అతని భార్య.. ఇద్దరూ లొంగిపోయారని తెలిపారు. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వ్యక్తి దేవా అని.. ఎన్ఐఏ నుంచి దేవా పైన రూ. 75 లక్షల రివార్డ్ ఉందని చెప్పారు. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్య, మంకు, అండా ఇలా మొత్తం 20 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. ఇప్పటి వరకు 576 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. తమకున్న సమాచారం ప్రకారం మావోయిస్టుల్లో తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మాత్రమే ఉన్నారన్నారు. ఐదుగురు సెంట్రల్ కమిటీలో, నలుగురు స్టేట్ కమిటీ వారు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

**సీఎం పిలుపుతో లొంగిపోతున్న మావోలు**

లొంగిపోయిన వారిలో తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ అడ్లూరి ఈశ్వరి ఉన్నారని తెలిపారు. 2ఎల్ఎంజీ, అమెరికన్ మేడ్ కోల్ట్ గన్, ఇజ్రాయెల్ మేడ్ టవర్ వేపన్, 8 ఏకే47 గన్స్, 8 ఎస్ఎల్ఆర్ వెపన్స్, 4 బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్ సమర్పించినట్లు డీజీపీ తెలిపారు. హెలికాప్టర్‌ను సైతం కూల్చివేసే హెమోనిషాన్ 19 సైతం మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.ఇక పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మందికి పైగా మావోయిస్టులు ఉండే వారని.. ఇప్పుడు వారి సంఖ్య 66కు చేరిందన్నారు డీజీపీ. ఈ సంఖ్యను బట్టిచూస్తే పీఎల్‌జీ పూర్తిగా క్షీణించినట్లు అర్థమవుతోందన్నారు. రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా ఒక్కరు మాత్రమే తెలంగాణ స్టేట్ కమిటీ వారు మావోల్లో మిగిలారని వివరించారు. సీఎం పిలుపుతో మావోయిస్టులు లొంగిపోతున్నారని డీజీపీ తెలిపారు. డివిజన్ సభ్యులకు రూ. 5 లక్షలు, ఏరియా సభ్యులకు రూ. 4 లక్షలు, మిగతా సభ్యులకు రూ. 1 లక్ష రివార్డు అందజేస్తున్నట్లు తెలిపారాయన. మొత్తంగా లొంగిపోయిన వారికి రూ. 1.80 కోట్లు రివార్డు అందిస్తామన్నారు. తక్షణ సాయంగా రూ. 1 లక్షల చొప్పున ఇస్తున్నట్లు డీజీపీ తెలిపారు.

# అంజన్న ఆశీస్సులతోనే నాకు పునర్జన్మ

మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కొండగట్టు అంజన్న అంటే తనకు సెంటిమెంట్ అని, అంజన్న ఆశీస్సులతోనే ప్రమాదం నుంచి బయటపడ్డానని, కొండగట్టు తనకు పునర్జన్మనిచ్చిందన్నారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. కొండగట్టు అభివృద్ధికి తనవంతు సాయం చేస్తానని పవన్ అన్నారు. గతంలో దర్శనానికి వచ్చిన ప్పుడు దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. గిరి ప్రదక్షిణ అంశాన్ని స్థానిక నేతలు తన దృష్టికి తెచ్చారు. కొండగట్టు గిరి ప్రదక్షిణకు సహాయం చేస్తామని పవన్ చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ కృతజతలు తెలిపారు. రేవంత్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని, ఆంజన్న ఆశీస్సులు ఆయనకు ఉండాలని పవన్ పేర్కొన్నారు.

**జనసేన కార్యకర్తలతో సమావేశం...**

కొండగట్టు అంజన్న స్వామి దర్శనం, మండప నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం నాచుపల్లి శివారులోని బృందావనం రిసార్ట్‌లో జనసేన కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. మరోవైపు ఇటీవల జరిగిన గ్రామ సర్పంచి ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులతో కూడా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కూడా పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం పవన్ కల్యాన్ మధ్యాహ్నాం తిరుగు ప్రయాణమయ్యారు. ఏపీ డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. రెండు రోజుల నుంచి జనసేన కార్యకర్తలు పవన్ కల్యాణ్ పర్యటన కోసం ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన ఎన్నికలో జనసేన ప్రచారం రథం వారాహికి పూజలు కూడా కొండగట్టులో నిర్వహించారు.



**ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డిని వారి నివాసంలో పరామర్శించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ - ప్రతిపక్షం, హైదరాబాద్**

# విద్య, వైద్యం, సాగునీటిపై నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి



వీడియో సందేశం విడుదల చేశారు. బాలికల విద్య కోసం ఆమె చేసిన పోరాటం దేశానికి ఆదర్శమని అన్నారు. 17 ఏళ్ల వయసులోనే బాలికల కోసం పాఠశాల ఏర్పాటు చేసి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న సావిత్రిబాయి పూలే త్యాగ ఫలితంగానే ఈ రోజు కోట్లాది మంది ఆడబిడ్డలు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. జనం బాటలో భాగంగా గద్వాల్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యత తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, ఆ ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యత పెంచేందుకు తెలంగాణ జాగృతి ప్రత్యేకంగా పనిచేస్తుందని తెలిపారు. సూర్యాపేట జిల్లా విప్లవ, సాయుధ పోరాటాలకు పెట్టింది పేరని, బండి యాదగిరి, మల్లు స్వరాజ్యం, మారోజు వీరన్న వంటి మహనీయులు పుట్టిన జిల్లా ఇదని కవిత గుర్తు చేశారు. ఇలాంటి చైతన్యవంతమైన జిల్లాలో కూడా అభివృద్ధి ఎక్కడ ఆగిపోయిందో తెలుసుకోవడానికే జనం బాట కార్యక్రమం చేపట్టామని తెలిపారు. స్కూల్స్, హాస్పిటల్స్, నీటి వనరులు, కాల్వల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. అర్వపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కవిత, వర్షాకాలం వస్తే స్కూల్ మొదటి అంతస్తు వరకు నీళ్లు నిలిచే దయనీయ పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో స్కూల్ కట్టడంతో ఎప్పటికీ నీరు నిలిచి దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. గత ఏడాది తుపాను సమయంలో కలెక్టర్ పరిశీలించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో పంట కాల్వల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అయినా, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కాల్వల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు కనీస నిధులు కూడా కేటాయించలేదని ఆరోపించారు. కోదాడ వరకు ఉన్న 70 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాల్వ సరిగా నిర్వహించకపోవడం వల్ల రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. రుద్రమ దేవి చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉన్నప్పటికీ కిలోమీటర్‌కు పైగా కాల్వ తవ్వకపోవడం వల్ల నీళ్లు రావడం లేదని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ చెరువును 5 టీఎంసీల రిజర్వాయర్‌గా చేస్తామని హామీ ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం లక్నవరం తరహాలో టూరిస్ట్ ప్లేస్ చేస్తామని చెప్పిందని, కానీ ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. ఎస్సారెస్పీ స్టేజ్-2లో భాగంగా నల్గొండ జిల్లాలో రైతాంగానికి మేలు చేసే విధంగా రిజర్వాయర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన కవిత గారు, 40 ఏళ్లుగా అక్కడ 30 పడకల ఆస్పిటల్‌తోనే ఆరు మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 2018లో కేసీఆర్ 100 పడకల ఆస్పిటల్ హామీ ఇచ్చారని, 2022లో శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం మారాక మళ్లీ శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. సరైన సదుపాయాలు లేక ప్రజలు ప్రైవేట్ ఆస్పిటల్స్‌కు వెళ్లాల్సి వస్తోందని, నెలకు రెండు డెలివరీలు మాత్రమే జరుగుతున్నాయని పేర్కొన్నారు. హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటలో కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మూడేళ్లుగా వాడకంలో లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కవిత అన్నారు. గాలి, రీ సౌండ్ లేకపోవడం, ఫ్లాట్ ఫామ్ ఎత్తుగా ఉండడం వల్ల ముఖ్యంగా మహిళా రైతులు ఇబ్బంది పడుతూ బయటే కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. చిన్నపాటి సమస్యలతో ఇంత పెద్ద ప్రభుత్వ ఆస్తి ఖాళీగా ఉండటం సరికాదని, కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్‌పహాడ్ మండలం చీరెల్ల గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కవిత పరిశీలించారు. సూర్యాపేట-చీరెల్ల రోడ్ పూర్తిగా గుంతలమయమై ప్రమాదకరంగా మారిందన్నారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా రోడ్డు లేకపోవడం బాధ కలిగిస్తోందని చెప్పారు. కోదాడ-సూర్యాపేట నియోజకవర్గాల మధ్య ఉండటం వల్ల గ్రామం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ఈ రోడ్లను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫ్రీ బస్ అంటున్న ప్రభుత్వం ఈ గ్రామానికి బస్సే లేకుండా చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో లాటరీ గందరగోళం, మౌలిక వసతుల లేమిపై కలెక్టర్‌కు లేఖ రాస్తానని తెలిపారు. ప్రజలను ఓటు వేసే యంత్రాల్లా చూసే రాజకీయ సంస్కృతి మారాలని కవిత గారు అన్నారు. విద్య, వైద్యం ప్రజలకు అత్యవసరమైన అంశాలని, వాటి కోసం తెలంగాణ జాగృతి పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు, ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.



లోకేశ్ విదేశీ పర్యటనపై అనేక సందేహాలు ఉన్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకు రహస్య ప్రదేశాల నుండి ట్వీట్లు చేస్తున్నారు. పెట్టుబడులపై ఫోర్బ్స్ నివేదిక అంటూ తప్పదోవ పట్టిస్తున్నారు. ఎంవోయూలతోనే పెట్టుబడులు వచ్చేసినట్టు చెబుతున్నారు. అనుకూల మీడియాకూ ఆయన ఎక్కడున్నారో తెలియదంటే ఏదో జరుగుతోందనే అనుమానం కలుగుతోంది.

- కాకాని గోవర్ధన్ రెడ్డి, వైసీపీ నేత

# పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో బతకడమే మా లక్ష్యం

- పార్టీలు, వర్గాలకు అతీతంగా గృహ జ్యోతి పథకం
- కొత్తవారు ప్రజా పాలన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి3:** పేద బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అందులో భాగంగా 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం భవిష్యత్తులో ఈ పథకాన్ని కొనసాగి స్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం అసెంబ్లీలో సభ్యులు, జీ. మధుసూదన్ , నాగరాజు, కవంపల్లి సత్యనారాయణ తదితరులు అడిగిన పలు ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానమిచ్చారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా రాష్ట్రంలోని అర్హులైన వారంద రికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. గృహజ్యోతి పథకం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి అనేవారు, మార్పులు, చేర్పులు చేయించాలి అనుకునేవారు ఎంపీడీవో కార్యాల యంలోని ప్రజా పాలన అధికారులను కలిసి కొత్తవారు దరఖాస్తు చేసుకోవచ్చు, పాతవారు వివరాలను అప్డేట్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం వివరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అధికారంలో కి రాగానే రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ పథకం కింద ఎస్పీడీసీఎల్ పరిధిలో 25, 35, 560 మంది ఎన్పీడీసీఎల్ పరిధిలో 27, 46, 938 మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 52, 82, 498 కుటుంబాలు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం ద్వారా పొందుతున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈరోజు వరకు గృహ జ్యోతి లబ్ధిదారుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం 3,593 వేలకోట్లు ఇప్పటివరకు చెల్లించిందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 45,995 కుటుంబాలు, అచ్చంపేట నియోజకవర్గంలో 40,555 కుటుంబాలు, ఆది ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ లో 65,862 సిద్దిపేట నియోజకవర్గంలో 50,398 కుటుంబాలు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నా యని తెలిపారు.

**ప్రాముఖ్యత ఆధారంగా ప్రాజెక్టులు బిల్లుల చెల్లింపులు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 3: కృష్ణానది పైనున్న ప్రాజెక్టులు ముఖ్యంగా పాలమూరురంగారెడ్డి ప్రా జెక్టు సహా అన్నింటిపై ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షలు చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు సంబంధించి ప్రజాప్రభుత్వం చాలా సీరియస్ గా పనిచేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆధారంగా చేసుకుని బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ముఖ్యమంత్రిగారు చెప్పారని ఆయన సభలో పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎప్పటికప్పుడు కృష్ణానది ప్రాజెక్టులపై సమీక్షలు చేస్తున్నా రని అన్నారు. అంతేకాక పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరిపుతున్నారని అన్నారు. పెండింగ్ బిల్లుల విషయంలో కాంట్రాక్టర్లదే ఆలస్యం తప్ప ప్రభుత్వం దగ్గర ఎటువంటి ఇబ్బందులు లేవని భట్టి విక్ర మార్క సభలో స్పష్టంగా చెప్పారు.

# అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండ

- జయ జయహే గీతం ద్వారా తెలంగాణ ప్రజలు ఏకం
- తెలంగాణ సాంస్కృతిక, సామాజిక పురోగతికి కృషిచేసిన అందె శ్రీ కుటుంబాంలో ఒకరికి ఉద్యోగం
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి3 :** జయ జయహే తెలంగాణ గీతం ద్వారా రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన అందెశ్రీ సేవలను ప్రభుత్వం గుర్తించింది, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయి చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అందెశ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడానికి వీలుగా 1994 ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, వేతన నిర్మాణ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర శాసన సభలో శనివారం ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ అందెశ్రీ పశువుల ఎటువంటి సాధికారత విద్య లేకున్నా తెలంగాణ గ్రామీణ మరియు అనగారిన వర్గాలను ప్రతిబింబించేలా ఆయన 3 వేల కవితలు రచించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు, పోరాటాలు వాటి స్ఫూర్తిని తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన జయ జయ హే తెలంగాణ గీతం రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర వహించింద ని తెలిపారు. గౌరవనీయమైన వ్యక్తికి ప్రతీకగా నిలిచిన అందెశ్రీ వారసత్వం తెలంగాణ అంతట కొనసాగుతుం ది అన్నారు. అందెశ్రీ విప్లవాత్మక కవితలు భావోద్వేగంతో కూడిన గేయాలు కార్మికులు, రైతులు, అణగారిన వర్గా లను ప్రభావితం చేయడమే కాకుండా వారి పోరాటాల ను వ్యక్తీకరించాయి, తెలంగాణ సంస్కృతికి స్వరంగా నిలిచాయి అన్నారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని 2 జూన్ 24 న 783 జీవో ద్వారా ఆమోదించిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి వారు అందించిన అమూల్యమైన సేవలను దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

# 'సర్' ను వేగవంతంగా పూర్తి చేయాలి

- బీఎల్వోలు, సూపర్ వైజర్లు క్షేత్రసాయిలో పనిచేయాలి
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** బీఎల్ వోలు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇం టెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్వోకు ప్రతి రోజు 30-40 ఎంట్రీల లక్ష్యాన్ని కేటాయించి, ప్రతి ఇంటి వద్దకు వెళ్లి క్షే త్రస్థాయిలో ఫీల్డ్ సందర్శనలు నిర్వహించి, టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. సూపర్వైజర్లు కూడా ప్రతీ రోజు ఇంటి ఇంటికి వెళ్లి ఫీల్డ్ సందర్శనలు నిర్వహిస్తూ ఎంట్రీలు పూర్తి చేయాలని సూచించారు. ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్య వేక్షించి, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. డెస్క్ వర్క్ ను సమాంతరంగా నిర్వహిస్తూ డేటా సరిగా ఎంటర్ అయ్యేలా చూసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరె న్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లా డుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువు లోగా పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు మరియు సూపర్‌వైజర్లతో క్షేత్ర స్థాయిలో ప్ర క్రియను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావే శంలో డిఆర్ఓ సంగీత, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జోనల్, డిప్యూటి కమిషనర్లకు అధికారాల బదిలీ

- కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఉత్తర్వులు

**ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్ 3:** జీహెచ్ఎంసీ పరిధి 650 చ.కిమీ నుంచి 2,053 చ.కిమీకి విస్తరిం చిన నేపథ్యంలో, ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు జీహె చ్ఎంసీ నిర్ణయించింది. ఈ క్రమంలో వికేంద్రీకృత పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా, జీహెచ్ఎం సీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ జోనల్, డిప్యూటీ కమిషన ర్లకు కీలక అధికారాలను బదిలీ చేశారు. జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 119 ప్రకారం, ఆస్తి పన్ను అంచనాలు, సవరణలు, మ్యూటేషన్లు, మినహాయిం పులు తదితర సేవలకు సంబంధించిన అధికారాలను నిర్దిష్ట పరిమితులు, షరతులతో జోనల్ కమిషనర్లు మరియు డిప్యూటీ కమిషనర్లకు అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో పరిపాల నా ఆలస్యాలు తగ్గి, ప్రజల దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు మరింత చేరువైన పాలన సాధ్యమ వుతుంది. ఇది వికేంద్రీకృత పరిపాలన, పారదర్శకత మరియు సమర్థవంతమైన పట్టణ పాలన పట్ల జీహె చ్ఎంసీ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అప్పగించిన అధి కారాలు సంబంధిత ఎస్ఓపీ లు మరియు జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనల ప్రకారం అమలు చేయబడ తాయి. పరిపాలన ప్రయోజనార్థం ఈ అధికారాలను సమీక్షించడానికి, సవరించడానికి కమిషనర్ సమీక్షి స్తారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి రానుంది.

# పేదవారి ఆరోగ్య భద్రత.. ప్రభుత్వ బాధ్యత


- గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులను అనుసంధానం
- ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కరానికి కట్టుబడి ఉన్నాం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** ఆర్ఎంపీ , పీఎంపీ పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు శాసన మండలి లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమాధానం చెప్పారు. పేదవారి ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యత అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య , ఆరోగ్య సం రక్షణ సేవలను బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్య , వైద్య శాఖల మంత్రిగా సేవలను అందించటం వరంగా భావిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలను అం దిస్తున్న సబ్ సెంటర్స్ , ఆరోగ్య మందిర్ లను , పీహెచ్ సీ కేంద్రాలను, ఏరియా ఆసుపత్రులను, జీజీహెచ్ లకు అనుసంధానం చేస్తున్నామన్నారు . ఆర్ఎంపీ, పీఎంపీలకు గతంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఆర్ ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వటంపై ఐఎంఏ తెలంగాణ , డాక్టర్స్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయిం చటం తో న్యాయపరమైన అంశాలు కోర్ట్ లో పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్క రానికి కట్టుబడి ఉన్నామన్నారు. గౌరవ శాసన మండలి సభ్యులు చేసిన పలు సూచనలను పరిగణలోకి తీసుకుంటా మని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# డ్రగ్స్ కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్

- తెలుగు రాష్ట్రాల్లో సంచలనం
- నానక్‌రామ్‌గూడలో ఈగల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు
- సోదాల్లో బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి



**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** హైదరా బాద్‌లోని నానక్‌రామ్‌గూడలో శనివారం ఈగల్ టీమ్ ప్ర త్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్లు అధికారు లు గుర్తించారు. ఈ క్రమంలో సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వెంటనే ఆయనని అరెస్ట్ చేసి, డీఅడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సుధీర్‌రెడ్డితో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డిని పోలీసులు విచారిస్తున్నారు. ఆయనకు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును పోలీసులు సీరియ స్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుధీర్‌రెడ్డి డ్రగ్స్ కేసు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా, సుధీర్‌రెడ్డి గత కొంతకాలంగా డిప్రెషన్‌లో ఉన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఈగల్ టీమ్‌కి వచ్చిన ఫోన్ కాల్‌తో సుధీర్‌రెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగాయి. ఈ క్రమంలో ఆయనతో పాటు ఇంట్లో ఉన్న మరో ఇద్దరు స్నేహితులని అరెస్ట్ చేశారు. సుధీర్‌రెడ్డికి మాత్రమే గంజాయి పాజిటివ్, మిగిలిన ఇద్దరు స్నేహితులకు నెగిటివ్‌గా నిర్ధారించారు. సుధీర్‌రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సోదాల సమయంలో డ్రగ్స్, గంజాయి దొరకలేదని ఈగల్ టీమ్ అధికారులు చెబుతున్నారు. డిప్రెషన్ కారణంగానే డ్రగ్స్‌కి సుధీర్‌రెడ్డి అలవాటు పడినట్లు తెలిపారు. సుధీర్‌రెడ్డి ఈ కేసులో పట్టుబడిన తర్వాత కుటుంబ సభ్యులకు ఈగల్ టీమ్ అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన స్థా నికంగా కలకలం సృష్టించింది. ఈ నేపథ్యంలో రాజకీయ కుటుంబ సభ్యుల డ్రగ్స్ వినియోగంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి ఘటనలు బయటకు రావడంతో యువతపై ప్రభావం చూపించే డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్ర భుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

# సావిత్రి బాయి పూలేకు ఘన నివాళి

- మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక విప్లవకారిణి, స్త్రీ విద్యకు మార్గదర్శకురాలు అయిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సం దర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులు అర్పించారు. సావిత్రిబాయి పూలే ఒక వ్యక్తి మాత్రమే కాదు——ఆమె ఒక ఉద్యమమ ని, మహిళలకు విద్య అవసరం లేదన్న అంధ విశ్వాసాలు ప్రబలంగా ఉన్న కాలంలో, ఎన్నో అవమానాలు, అవరో ధాలు ఎదుర్కొంటూ కూడా ఆమె ధైర్యంగా ముందుకు సాగారనీ కీర్తించారు. విద్యే ఆయుధమని నమ్మి, బాలికల కోసం పాఠశాలలు ప్రారంభించి, సమాజంలో సమాన త్వానికి బలమైన పునాది వేశారని కొనియాడారు. "విద్య లేకుండా విముక్తి లేదు" అన్న సందేశాన్ని తన జీవితం తోనే నిరూపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమె చూపిన మార్గంలో నడవడం అంటే ప్రతి బాలికకు విద్య, ప్రతి మహిళకు గౌరవం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడమే అన్నారు. నేడు మన రాష్ట్రం విద్య, సామాజిక న్యాయం, మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతున్నదంటే, దానికి సావిత్రిబాయి పూలే లాంటి మహనీయుల ఆలోచనలే ప్రేరణ. ప్రభుత్వంగా మేము కూడా ఆమె ఆశయాలకు అనుగుణంగా విద్యను అందరికీ చేరువ చేయడానికి, ముఖ్యంగా బాలికల విద్యను ప్రోత్సహించడానికి కట్టు బడి ఉన్నామని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే గారి ఆశయాలను మన జీవితాల్లో అమలు చేస్తామని, విద్య ద్వారా సమాజాన్ని మార్చేందుకు ప్రతి ఒక్కరం మా వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం అంటూ పిలుపునిచ్చారు.

# పెండింగ్ సమస్యలపై అలసత్వం వద్దు



**ప్రతిపక్షం, వికారాబాద్, జనవరి 3:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం యాలాల రెవెన్యూ డిపార్ట్మెం ట్ లో పెండింగ్ కేసుల పరిష్కారంలో అలసత్వం ప్రద ర్శిస్తున్న మండల తహసిల్దార్ వెంకటస్వామి, సీనియర్ అసిస్టెంట్ పై వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కేవీ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.... రెవెన్యూ అధికారులపై ఉన్న నమ్మకంతో సమస్యల పరి ష్కారానికి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయా నికి వస్తున్న రైతులను, ప్రజలను పట్టించుకోకుండా వారు ఇస్తున్న ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తూన్నారని మం డిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఇవ్వకుం డా లబ్ధిదారులకు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఈ విషయంపై వెంటనే స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే వీరిని సస్పెండ్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు న్నామన్నారు. మొద్దు నిద్ర వీడకుండా ఇదే విధమైన వైఖరి తహసిల్దార్, సీనియర్ అసిస్టెంట్ కొనసాగించినట్లయితే తాసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కా ర్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.



# సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆ మహనీయురాలికి బీఆర్ఎస్ నేతలు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉపనాయ కుడు, మాజీ మంత్రి టి. హరీష్ రావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి , గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి, విప్ కేపీ వివేకానంద , ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశం, కృష్ణారావు, అజేయుడు, మాజీ జెడ్పీ ఛైర్మన్ తుల ఉమ, నాయకురాలు సుమత్రా నంద్, పాల్గొని సా విత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు హాజరై సావిత్రిబాయి పూలే సమాజ సం స్కరణకు చేసిన సేవలను స్మరించుకున్నారు. మహిళా విద్యకు ఆమె చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.



రంగారెడ్డి జిల్లా సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె రామారావు, రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఏడి జొన్నల పద్మావతిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ అలమనేటి గోపాల్, కొత్తపల్లి విక్రమ్ రెడ్డి, కమ్మరి యాదగిరి ఛారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
-ప్రతిపక్షం, మొయినాబాద్



# గిరిజనులకు సీపీఎం అండగా ఉంటుంది

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

**ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 3 :** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం రెవెన్యూలో సర్వేనెంబర్ 210, 211,212 లలో గిరిజనులు న్యా యబద్ధంగా చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసి అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్నారని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. కొంతమంది రాజకీయ పెద్దల, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రోత్బలంతో ము న్సిపల్ అధికారులు గిరిజనుల ఇళ్లను కూల్చివేయడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సీపీఎం మొయినాబా ద్ మండల కార్యదర్శి సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు కూల్చేసిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ... 111 జీవో సాకుతో పేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారని, ధనికుల ఫామ్ హౌస్, రిసార్ట్స్, కమర్షియల్ బిల్డింగ్స్ జోలికి వెళ్ల కుండా పేదలపై ప్రతాపం చూపుతున్నారని అన్నారు. ఇళ్ల కూల్చివేతకు కారణమైన రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాసరాజు, డి. సురేష్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఇండ్లు కూల్చేసిన మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల తరపున సీపీఎం పార్టీ న్యాయపోరాటం చేస్తుందని వారికి న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మొయినాబాద్ మండల నాయకులు మహేందర్, రాజేందర్, చెన్నయ్య, నరసింహ, ప్రభుదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కీలకమైన నీటి వాటాల అంశంపై చర్చపెడితే బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించింది. దీని వల్ల చట్ట సభల పట్ల బీఆర్ఎస్ చిన్న చూపు మరోసారి బయటపడింది. కేసీఆర్ సభకు రాకపోవడానికి కారణాలు ఏమీ లేవు. కృష్ణా జలాలు, పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు అంశంపై సూచనలు ఇస్తారని అనుకుంటే పారిపోయారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలి.

- సీఎం రేవంత్ రెడ్డి

ఓపెన్ వాయిస్

# 90 రోజుల్లో అంతిమ 'యుద్ధాని'కి ముగింపు !!

సీదీ బాత్

ఎస్. కె. జకీర్
90526 31212

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పెట్టిన మార్చి 31 డెడ్ లైను కన్నా ముందే 'మావోయిస్టు రహిత భారత్' ఏర్పడవచ్చునని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ కొద్ది రోజుల కిందటే మీడియాకు చెప్పారు.మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ ఊకె గణేశ్ ఎన్ కౌంటర్ తర్వాత బస్తర్ ఐజీ అంచనా సరైందే నన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.మావోయిస్టు పార్టీ బెటాలియన్ 1 కమాండర్,గెరిల్లా బార్సే దేవా తెలంగాణ ప్రభుత్వానికి లొంగిపోగానే ''మావోయిస్టుల చివరి భరోసా కూలిపోయింది''అని సీనియర్ జర్నలిస్టు మిత్రుడొకరు అన్నాడు.హిడ్మా తర్వాత ఈ ఆదివాసీ గెరిల్లా సైనికునిపై నే మావోయిస్టు పార్టీ నమ్మకం పెట్టుకున్నట్టుగా వార్తలు వస్తున్నాయి.

''మావోయిస్ట్ ఉద్యమ ప్రాంతమంతా నెత్తుటి మడుగులతో తల్లడిల్లుతోంది.ఒక్కొక్క విప్లవ శిఖరం నేల రాలుతుంటే ఉద్యమ ప్రాంతాలలో విషాద ఛాయలు అలుముకుంటు న్నాయి.వందలాది యోధులు ఓటమి తప్పదని తెలిసి,తమ తప్పులు అర్థమై మరో ప్రత్యామ్నాయ మార్గంతో ముందుకు వస్తున్నప్పటికీ అనుసరించడానికి తటపటాయిస్తూ నిండు జీవితాలను బలి పెట్టడం బాధాకరం,అత్యంత విషాదకరం .ఈ బాధ కేవలం మా చిరకాల సహచరుడు కామ్రేడ్ పాక హనుమంతు బంధు మిత్రులు, పరిచయస్తులకే పరిమితం కాలేదు.ఈ గుండె కోత యావత్తు విప్లవ శిబిరాన్ని అనేక రకాలుగా పునరాలోచింపచేస్తోంది.మనం ఇప్పుడు తన యావత్ జీవితాన్ని ప్రజల కోసం, ప్రధానంగా పునాది వర్గాల ప్రజల కోసం అంకితం చేసిన కామ్రేడ్ హనుమంతు పార్థివ శరీరం ముందు ఆయన జ్ఞాపకాలతో సతమతమ వుతూ విషాద క్షణాలలో నిలుచొని ఉన్నాము.వారి బంధు మిత్రులతో బాధను పంచుకుంటున్నాం. మీరంతా ప్రత్యక్షం గా విగత జీవిగా ఇంటికి చేరిన గణేష్ ఊళ్ళో ఉన్నారు.మీ భాగస్వామ్యానికి సెల్యూట్ చేస్తున్నాం''.

''మీతో మీ మధ్య లేనందుకు తీరని వేదనను అనుభవిస్తూ మీతో ఈ విషాద గడియలలో మా భావాలను పంచుకుం టున్నాం.ఇది ఒక అత్యవసరమైన సందేశమని భావించి ఈ వేళ మీ ముందు ఉంచుతున్నాం.మమల్ని సహృదయంతో అర్థం చేసుకుంటారని కోరుకుంటున్నాం. కామ్రేడ్ పాక హనుమంతు తన జీవితం, తన కుటుంబం,తన ఆశయాలు అన్ని అత్యంత ప్రతిభావంతంగా తన తండ్రి మరణ వార్త తెలిసిన మరుక్షణంలో మన అందరితో పంచుకున్నాడు.ఆ లేఖను మరోసారి మీడియా మిత్రులు ఈ సరైన సంద ర్భంగా ముందుకు తెచ్చారు. వారికి అభినందనలు.వారి కుటుంబ సభ్యులు ఎంత దుఃఖంలో ఉన్నప్పటికీ తాము ఎరిగిన కామ్రేడ్ హనుమంతు జ్ఞాపకాలను నెమరు వేసు కుంటున్నారు.ఈ క్షణంలో గణేష్ ఆశయాలను కొనసాగి స్తామని నిన్నటిలా నినదించడం కాదు, గణేష్ ను కాపాడు కోలేకపోయామన్న నిజమైన ఆత్మ చింతన మనలో మొద లవుతుంది.ఇది తక్షణ అవసరం.దయచేసి ఆలోచించండి. ఇది ఒక వ్యక్తి మరణంతో మాత్రమే ముడిపడిన విషయం అనుకుంటే మనకు అసలు వారి విప్లవ త్యాగాలే అర్థం కావు.వారు మహోన్నత లక్ష్యం కోసం నిజాయితీగా తమ జీవితాలను నిస్వార్థంగా అంకితం చేసిన గొప్పవారు''.

గద్దర్ ఉద్యమ ప్రభావంతో తెలంగాణ,దండకారణ్యంలో మనకు మన కాలం వీరులను స్మరించుకునే అవకాశం దక్కడం,వారి విప్లవ అనుభవాల విషాద కలబోతలు పంచు కోవడం.వాటిలో భాగంగా మనం మిగిలిన విప్లవకారులను కాపాడుకోవడానికి కనీసం ఇప్పటికైనా కామ్రేడ్ గణేష్ అమ రత్వం నుండి ఏం చేద్దాం? వారిని ఎలా రక్షించుకుందాం? అనేది ఆలోచించాలి.ఇది కేవలం మన సమస్య కాదు. ఇది భారత విప్లవోద్యమ సమస్య. ఇది అమరుల ఆశయాలు వృధా పోవని ప్రజలకు హామీ ఇవ్వాల్సిన క్షణం.అందుకు నిబద్ధతతో కూడిన విప్లవ ఆచరణ కావాలి.నిస్వార్థంతో గణేశ్ లాగ పని చేయాలి.హద్దులు ఏర్పరచుకొని పని చేసే వారంతా త్యాగానికి సిద్ధంగా లేమని తమకు తాముగా ప్రకటించుకోవడమే అవుతుంది.ఈరోజు విప్లవోద్యమం అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.నిన్నటి వరకు అనేక పార్థివ శరీరాల ముందు అత్యంత సీరియస్ గా ప్రతిజ్ఞలు చేసిన వారంతా గణేష్ స్మరణలో ఒక్కసారి ఆలోచించండి.అంతిమ యుద్ధంలో నిలిచి కొట్లుమిట్టా డుతున్న విప్లవోద్యమాన్నీ కాపాడుకోవడానికి మిగిలిన విప్లవకారులను అజ్ఞాత జీవితం నుండి జ్ఞాత జీవితంలోకి రావాలని వినమ్రంగా ఏకాభిప్రాయంగా విజ్ఞప్తి చేద్దాం. గణేష్ అమరత్వమే కాదు,నిన్నటి అమరులు బసవరాజు, విజయ్, లోకేష్, మనోజ్, హిడ్మా, గౌతం,ఉదయ్... లాంటి అనేక మంది అమరత్వాలు చాటుతున్నాయి.వారి చొరవ ను,నిర్ణయాత్మక శక్తిని దెబ్బ తీస్తూ వారి అసమాన ధైర్య సాహసాలకు పరీక్షను పెడుతున్నాయి.ఫలితంగా వారిని నష్టపోయాం.ఇంకా మనం తెలిసి,తెలియక అలాంటి వాటికి పూనుకోకూడదు అని మేము సవినయంగా విన్న వించుకుంటున్నాం''.

''విప్లవోద్యమ నష్టాలపై ఎంతైనా సిద్ధాంత చర్చలు మనం చేసుకోవచ్చు.కానీ ముందు ఉద్యమ సహచరులను కాపా దుకుందాం.ప్రతి అమరుడి కుటుంబం అదే కోరుకుంటు న్నది.తమ బిడ్డలా ఏ తల్లి బిడ్డ తమ కళ్ళ ముందు విగత జీవిగా మారి ఇంటికి రాకూడదనే భావిస్తోంది. బిడ్డలను కోల్పోని వాళ్ళకు అనేక పరిమితులతో పని చేసే వారికి ఈ క్షోభ అర్థం కానేకాదు.కాబట్టి, మిత్రులారా, కామ్రేడ్ గణేష్ అమరత్వం అనివార్యమైనది ఏమీ కాదు.అనూహ్యమైనది అంతకన్నా కాదు.సాయుధంగా మిగిలిన ఏ ఒక్కరూ మిగ లనంతటి తీవ్ర సంక్షోభంలో ఉన్న విప్లవోద్యమాన్ని కాపాడు కోవడానికి మిగిలిన విప్లవకారులు అనవసర నష్టాలకు బలి కాకుండా మొదటగా నిలుపుకుందామని శపథం చేద్దాం. ఆలస్యం చేయకుండా వారిని మన మధ్యకు ఆహ్వానిద్దాం. ఇదే గణేష్ కు మనం అర్పించే నిజమైన నివాళి అవుతుంది. కడుపు కోతకు గురైన తల్లులకు నిజమైన ఊరటను ఇస్తుం ది.ఏ గ్రామానికి ఇక పార్థివ శరీరాలు రావనే హామీని ఇస్తుంది.భారత ప్రజల విప్లవానికి భవిష్యత్తు ను ఇస్తుంది''. అంటూ 'గణేష్ ఉద్యమ సహచరులు' పేరిట ఒక సుదీర్ఘ లేఖ డిసెంబర్ 28 న మావోయిస్టు అగ్రనేత గణేష్ అంత్య క్రియల సమయంలో విడుదలయింది.

ఈ లేఖపై కొందరు 'విప్లవాభిమానులు' తీవ్ర అభ్యంతరం లేవదీశారు.'సాయుధ పోరాట విరమణ చేసిన ఉద్యమ సహచరులు' పేరుతో విడుదలయిన లేఖ డూప్లికేట్ అని, మావోయిస్టు పార్టీ మాజీ నాయకుడు,విప్లవ ద్రోహి జంపన్న సృష్టించిన లేఖ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వెల్లువెత్తాయి.మావోయిస్టు పార్టీ ప్రభావిత ఉద్యమ ప్రాం తాల్లో,అడవుల్లో కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాల దాడుల కారణంగా,లొంగుబాట్లు,ఎన్ కౌంటర్ల కారణంగా పార్టీ శ్రేణులన్నీ చెల్లా చెదురయిపోయాయి.పార్టీలో పొలిట్ బ్యూరో,కేంద్రకమిటీ స్థాయిలోనే సైద్ధాంతిక విభేధాలు వచ్చాయి.పార్టీ సెక్రెటరీ బసవరాజు,హిడ్మా,చలపతి,మోడె మ్ బాలకృష్ణ తదితర సీనియర్లు,కీలక నేతలు,కమాండర్లు ఎన్ కౌంటర్ లలో మరణించడం,పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్,అగ్ర నేతలు తక్కెళ్లపల్లి వాసుదేవ రావు,రాంథేర్,అనంత్ వంటి సీనియర్లు లొంగిపోవడం వంటి పరిణామాలతో విప్లవోద్యమం తీవ్ర సంక్షోభానికి గురైంది.ఈ సంక్షోభ వాతావరణంలో మరో కేంద్రకమిటీ సభ్యుడు ఊకే గణేశ్ ఎన్ కౌంటర్ లో బలయ్యారు.హైదరా బాద్,ఢిల్లీ,కోల్ కతా,త్రివేండ్రం వంటి నగరాల్లోని 'విప్లవ మేధావులు' మాత్రం సాయుధపోరాట విరమణను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.ప్రస్తుతం పార్టీకి సారధ్యం వహిస్తున్న దేవ్ జీ సహా మిగిలిన వారెవరూ 'జన జీవన స్రవంతి'లోకి రాకూడదని ఆకాంక్షిస్తున్నారు.ఇందుకు అనుగుణంగా నినాదాలు చేస్తున్నారు.రచనలు చేస్తున్నారు.సభలు,సమా వేశాలు పెట్టి మావోయిస్టుల అమరత్వాన్ని కీర్తిస్తున్నారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను,వాసుదేవరావు అలియాస్ రూపేశ్ లను 'విప్లవ ద్రోహులు'గా ఇదివరకే ముద్ర వేశారు.ఎవరు విప్లవ ద్రోహులో,ఎవరు విప్లవకారు లో పట్టణాలు,నగరాల్లో నివసిస్తున్న 'మావోయిస్టు మద్దతు దారులు' సర్టిఫికెట్లు జారీ చేయడం ఒక వింత!

''నా విద్యార్థి రోజుల్లో రాడికల్ యూత్ ఆర్గనైజేషన్‌లో చేరిన తర్వాత, నేను 1990లో అజ్ఞాతవాసానికి వెళ్లాను. ఆ సమయంలో,దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం అవసరం. మాకు అఖండమైన ప్రజా మద్దతు లభించింది.అందుకే పోరాటం చాలా కాలం కొనసాగింది.మారిన కాలమాన పరిస్థితులలో సాయుధ పోరాటం ఔచిత్యం లేదు. గత రెండు లేదా మూడు సంవత్సరాలుగా పార్టీ ఈ అంశంపై చాలాసార్లు చర్చించింది, కానీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఇంతలో, భద్రతా దళాల నుండి ఒత్తిడి క్రమంగా పెరుగు తోంది.పార్టీ సెక్రెటరీ బసవ రాజు కూడా సాయుధ పోరాట విరమణకు అనుకూలంగా ఉన్నారు.ఆయన మరణం తర్వాత, పొలిట్ బ్యూరో, సెంట్రల్ రీజినల్ బ్యూరో సభ్యుడు భూపతి, నేను ఆయన మార్గాన్ని అనుసరించి ఆయుధాల ను వదులుకుని ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణ యించుకున్నాము.ప్రజల పోరాటం కొనసాగుతుంది,కానీ తుపాకులు కాదు రాజకీయాలు ఆయుధంగా ఉంటాయి. కొత్త పార్టీని ఏర్పాటు చేయాలా లేదా మరొకదానికి మద్దతు ఇవ్వాలా అని మేము ఇంకా నిర్ణయించుకోలేదు. యుద్ధం జరిగినప్పుడల్లా ప్రజలు చనిపోతారు.ఉద్యమం లో ఈ త్యాగాలు తప్పనిసరిగా ఉంటాయని మాకు ముందే తెలుసు.పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కూడా చనిపోయి నారు.కానీ మేము యుద్ధభూమిని విడిచిపెట్టలేదు.భావజా లం,పోరాటం కాలానుగుణంగా నవీకరించబడలేదనేది నిజం.అందుకే ఉద్యమం కొన్ని ప్రాంతాలకు పరిమితం చేయబడింది.ప్రజల విశ్వాసం క్రమంగా క్షీణించింది.అభి వృద్ధి,ప్రజల అవసరాలు సమ్మతి ఆధారంగా ఉండాలి.బల వంతంగా విధించబడకూడదు.పెట్టుబడిదారులకు గనులు ఇవ్వడం,అడవులను తొలగించడమే అభివృద్ధి కాదు.తాను మరణించినప్పటికీ, సాయుధ పోరాటాన్ని విరమించకూడ దని దేవ్ జీ విశ్వసిస్తున్నారు.ప్రస్తుతం దేవ్‌జీ కేంద్ర సైనిక కమిటీ అధిపతి,పొలిట్ బ్యూరో సభ్యుడుగా ఉన్నారు''అని ఒక మీడియా ప్రతినిధికి మావోయిస్టు పార్టీ అగ్రనేత తక్కెళ్ల పల్లి వాసుదేవరావు అలియాస్ రూపేష్ అలియాస్ ఆశన్న చెప్పారు.

''ఆపరేషన్ కగార్ మార్చి 2026 నాటికి దేశంలోని మా వోయిస్టులను తుడిచిపెట్టుకు పోయేలా చేస్తే ఆ పోరాట పంథాను అర్థాంతరంగా విభేదించి సాయుధపోరాటానికి ఇప్పుడు సందర్భం కాదని చెబుతూ ఆయుధాలతో ప్రభుత్వా నికి లొంగిపోయిన ఒకప్పటి సాయుధ విప్లవ నాయకులు మల్లోజుల వేణుగోపాల్, తక్కెళ్ళపల్లి వాసుదేవ రావు వాళ్ళ బాటలో ప్రభుత్వాల ఎదుట తమ ఆయుధాలు సమర్పించిన వందలాదిమంది నిన్నటి మావోయిస్టులు విభిన్న తరహా రాజకీయాలను చేయగలరా? కొన్ని పత్రికలు,మీడియా సంస్థలు పేర్కొంటున్న విధంగా వాళ్ళు,వాళ్ళలో కొందరు ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తే ఆ పార్టీ మనుగడ సాధ్యం అవుతుందా అనే సంశయం కలుగుతున్నది. వాళ్ల నాయకత్వ ప్రభావం మొన్నటివరకూ వాళ్ళు పనిచేసిన ఛత్తీస్ గఢ్,ఒడిషా,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,మ ధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఉండగలిగే అవకాశాలు తక్కువే.దీనికి ఇప్పటి రాజకీయ పార్టీల వ్యవహారశైలి,వాళ్ళ కార్యాచర ణ,ఎన్నికల సందర్భంగా వాళ్ళనుసరిస్తున్న వ్యూహాలు,వాళ్ల ప్రణాళికాబద్ధమైన ఓట్లనర్ధించే శైలి ఒక కారణం కావచ్చు. ఇప్పుడున్న భారత ప్రజాస్వామ్యంలో ఓట్లను అర్థించడాని కి చిన్నచిన్న రాజకీయ పార్టీలు పడుతున్న పాట్లు ఇక్కడ మనం గమనం లోకి తీసుకోవాలి.సాయుధపంథా అను సరించిన నాడు పొలిట్ బ్యూరో సభ్యులుగా నాయకత్వ పటిమ కలిగి శ్రేణులను దిశానిర్దేశం చేసిన నాయకులు సగటు రాజకీయ పార్టీలలో అంతే స్ఫూర్తిదాయక చైతన్యా న్ని రగిలించగలిగే పరిస్థితులు ఉండక పోవచ్చు.ఇవన్నీ ఆచరణ ప్రధానంగా గత అనుభవాల ప్రధానంగా వస్తున్న భావనలు.మనదేశం లో ఇప్పుడు రాజకీయ పార్టీలుగా మనగలగడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ.వ్యక్తుల నాయ కత్వ పటిమ న్యూక్లియస్ గా రాజకీయ పార్టీలు ఉద్భవిస్తే ఉద్భవించవచ్చు గానీ ఆ పార్టీలు అధికారాన్ని అందుకునే స్థాయి కష్టమైన పనే.ముఖ్యంగా నిన్నటిదాకా ఒక సిద్ధాం తాన్ని ఆచరణాత్మకం చేయడం కోసం ముందుకు వెళ్లిన నాయకులు అదే సిద్ధాంత ఒరవడిని పార్లమెంటరీ ఎన్ని కల ప్రక్రియ ఊతంగా ముందుకు తీసుకుపోగలరా అనేది సంశయం.వ్యక్తులు,సంస్థలు,నాయకులు కొత్త రాజకీయ పార్టీలను స్థాపించరాదని కాదుగానీ ఆ పార్టీలకు జన బాహుళ్యం లో నిజంగా ఆశించిన మద్దతు లభిస్తుందా? తెలుగు రాష్ట్రాలలో కమ్యూనిస్టు భావజాలం ఒకటి రెండు జిల్లాలకే పరిమితమైంది. ''దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా,జార్ఖండ్‌ల మీదుగా వ్యూహాత్మకం గా తిరోగమించివుంటే లేదా ప్రధాన బలగాలను, నాయ కత్వాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించివుంటే చరిత్ర ఇంకో రకంగా ఉండేది.మెయిన్ ఫోర్స్ గా ఉన్న రెండు బెటాలియన్లను,వాటి నాయకత్వాన్ని,పార్టీ కార్యదర్శి బసవరాజ్ సహా పలువురు సీసీ సభ్యులను,ముఖ్యమైన డీకే ఎస్జెడ్సీ సభ్యులను బయటి ప్రాంతాలకు 2025 ప్రవేశిం చడానికి ముందే కనుక తరలించివుంటే ప్రస్తుత పరిస్థితి ఉత్పన్నమయ్యేదే కాదు.ప్రజల మనోనిబ్బరం నిలబెట్టడాని కి, శత్రుబలగాలను చికాకుపర్చే చర్యలు చేపట్టడానికి పీఎ ల్జీఏకు చెందిన సెకండరీ ఫోర్స్,ప్రజా మిలీషియాకు చెందిన ప్లాటూన్లను పార్టీ నిర్మాణ దళాలను (ఎల్ఓఎస్) మాత్రం ఉంచి వుంటే అవి ప్రజల సహకారంతో రహస్యంగా సంచ రించేవి.ప్రభుత్వ బలగాలకు వాటి ఆనుపానులు దొరకడం కష్టమయ్యేది.అలా కాకుండా బెటాలియన్,కంపెనీ స్థాయి ఫార్మేషన్లను గెరిల్లా బేస్ ప్రాంతాల్లోనే ఉంచిన ఫలితంగా వాటి కదలికలను,క్యాంపుల ఉనికిని పోలీసులు డ్రోన్స్,శాటి లైట్స్ ద్వారా చాలా సులభంగా గుర్తించగలిగారు.ఆ సర్క్యు లర్‌లోనే చెప్పినట్టు ప్రభుత్వ బలగాల కంట్రోలులోకి వచ్చిన గ్రామాల్లో ఏర్పరచుకున్న ఇన్ఫార్మర్ నెట్వర్క్ కూడా వారికి బాగానే ఉపయోగపడింది.వచ్చిన సమాచారాన్ని వినియో గించుకుని,టెర్రయిన్ పైన పట్టు ఉన్న స్థానిక ఆదివాసీలతో కూడిన డీఆర్జీ బలగాల సహకారంతో దాడులు చేసి తీవ్ర నష్టాలను కలిగించింది'' అని గతంలో దండకారణ్యంలో దళనాయకునిగా పనిచేసి లొంగిపోయి,ఇప్పుడొక డిజిటల్ దినపత్రికకు ఎడిటర్ గా ఉన్న వ్యక్తి ఒక వ్యాసంలో రాశారు. 2024 ఆగస్టు సర్క్యులర్‌లో ఆపరేషన్ కగార్ గురించి పొలిట్‌బ్యూరో సరిగ్గానే వివరించింది. 2024 జనవరిలో ప్రారంభమైన ఈ యుద్ధచర్యలో శత్రువు ఇదివరకెన్నడూ లేని స్థాయిలో భారీ దాడికి పూనుకుంటున్నాడని వివరిం చింది.గతంలో కొనసాగిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ 1 అండ్ 2,ఆపరేషన్ సమాధాన్‌లకు ఈ కగార్ పూర్తి భిన్నంగా ఉన్నదని తెలిపింది.ఈసారి శత్రువు కార్పెట్ క్యాంపింగ్ పద్ధతిని అవలంభిస్తున్నాడని,20192023 కాలంలో ఏర్పాటు చేసిన 199 పోలీసు క్యాంపులకు తోడుగా మరిన్ని క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాడని పేర్కొంది.500 నుంచి 1000 వరకు సీఆర్పీఎఫ్ కోబ్రా, బీఎస్ఎఫ్ వగైరా బలగా లుండే ఈ క్యాంపులను ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఓబీ) లుగా పిలుస్తున్నారని, భవిష్యత్తులో వీటి సంఖ్య మరింత పెరగనున్నదని వివరించింది.గ్రీన్‌హంట్ కాలంలోనే 200 పోలీసు క్యాంపులను పెట్టారని,2200 కమ్యూనికేషన్ టవ ర్లను నిర్మించారని తెలిపింది.కగార్ యుద్ధం లక్ష్యం మావో యిస్టుల నుంచి బస్తర్ ప్రాంతాన్ని ప్రత్యేకించి అబూజ్మాడ్, దక్షిణ బస్తర్ గెరిల్లా బేస్‌లను 2025 చివరకల్లా విముక్తి చేయడంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించారని సర్క్యులర్‌లో ఆరోపించింది. జిల్లా,రాష్ట్ర, కేంద్ర బలగాలు ,ఆర్మీ,ఎన్ఎస్జీ కమాండోలు, వాయుసేన కలిపి ఇప్పటికే బస్తర్‌లో సుమారు ఏడు లక్షల శత్రు బలగాలున్నాయని అలర్ట్ చేసింది.ఈ బలగాలు అత్యాధునిక టెక్నాలజీని వా డుతున్నాయని, శాటిలైట్స్, డ్రోన్స్, నైట్ విజన్ డివైసెస్‌ను విచ్చలవిడిగా వాడుతున్నాయని చెప్పింది'' అని ఈ మాజీ మావోయిస్టు తెలిపారు.

''కార్పెట్ క్యాంపింగ్ అంటే ఉద్యమ ప్రాంతాలను చిన్న చిన్న క్లస్టర్లుగా విభజించి ప్రతి 5 నుంచి 10 కిమీ.లకు ఒక క్యాంపును ఏర్పాటు చేయడమని పొలిట్ బ్యూరో తెలిపింది. ఫలితంగా పీఎల్జీఏ బలగాల మొబిలిటీకి పరిమితులు ఏర్పడతాయని,బెటాలియన్, కంపెనీ స్థాయి పెద్ద ఫార్మే షన్లు తిరగడం కష్టమవుతుందని అర్థం చేయించింది.ఈ పరిస్థితుల్లో దాడులు చేస్తున్నప్పుడు తప్ప మిగతా అన్ని సమయాల్లో నాలుగేసి సభ్యులున్న రెండు టీంలతో కలిపి 8 మందితో ఏర్పడిన సెక్షన్ల సంఖ్యలోనే తిరగాలని, గెరిల్లా యుద్ధానికి అవసరమైన రహస్య పనివిధానాన్ని ఖచ్చితం గా పాటించాలని, ఆత్మరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది.పార్టీ, మిలిటరీ నిర్మాణాలకు సంబంధించి ఇంకా పలు నిర్ణయాలను తీసుకుంది.సంఖ్య లేని కొన్ని నిర్మా ణాలను రద్దు చేసింది.నిర్మాణాల్లో మార్పులుచేర్పులను, వ్యూహంఎత్తుగడల విషయంలో జాగ్రత్తలను చెప్పిన పొ లిట్ బ్యూరో కీలకమైన నిర్ణయానికి సంబంధించి బ్లండర్ మిస్టేక్ చేసింది. 31 పేజీల(ఇంగ్లీష్) ఆ సర్క్యులర్‌లోని 25వ పేజీలో, ఇతర పేజీల్లో ఇలా చెప్పింది.మావో యుద్ధ సిద్ధాంతాలను గమనంలో ఉంచుకుంటే 2024 ఆగస్టు దండకారణ్యం గెరిల్లా జోన్‌లో మనం చేపట్టాల్సింది టాక్టి కల్ రిట్రీట్.అనగా ప్రధాన బలగాలను ఇక్కడే ఉంచి, ఇతర బలగాలలో, పార్టీ నాయకత్వంలో కొంత భాగాన్ని కార్పెట్ సెక్యూరిటీ ఉన్న ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలి. ఇక్కడున్న ప్రధాన బలగాలు మారిన పరిస్థి తుల్లో చిన్న ఫార్మేషన్లుగా తిరగాలి. దాడుల సమయంలో కలవడం, తర్వాత విడిపోవడం ప్రాతిపదికన అబూజ్మాడ్, దక్షిణ బస్తర్ బెటాలియన్లు పనిచేయాలి.''

మావోయిస్టు పార్టీ సర్క్యులర్‌లో పొలిట్‌బ్యూరో చెప్పిన ప్రభుత్వ కగార్ యుద్ధవ్యూహాన్ని,ఎత్తుగడలను మిలిటరీప రంగా విశ్లేషిస్తే అబూజ్మాడ్,దక్షిణ బస్తర్ ప్రాంతాల నుంచి పార్టీ చేయాల్సింది టాక్టికల్ రిట్రీట్ కాదు.నిజానికి స్ట్రాట జికల్ రిట్రీట్ చేయాలి.భారత మిలిటరీ,పారా మిలిటరీ బలగాల సంఖ్య, ఆయుధసంపత్తి, వనరులతో పోల్చితే, మావోయిస్టు బలగాలకు హస్తి మశకాంతరం వంటి తేడా కనపడుతుంది.నారాయణపూర్,బీజాపూర్,సుక్మా జిల్లాల్లో ని భూభాగంతో కూడిన పరిమిత ప్రాంతంలో మావోయిస్టు లకు చెందిన మెయిన్ ఫోర్స్ గా ఉన్న రెండు బెటాలియన్లు, సెకండరీ ఫోర్స్ గా ఉన్న మరికొన్ని కంపెనీలు,ప్లాటూన్లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. భారత ప్రభుత్వ బలగాలు ప్రతి 5 నుంచి 10 కిమీ.ల పరిధిలో 5001000 మంది బలగాలతో కూడిన ఒక క్యాంపును కార్పెట్ సెక్యూ రిటీలో భాగంగా ఏర్పాటు చేస్తున్నాడంటే,ఆ విషయాన్ని పొలిట్ బ్యూరో సీరియస్‌గా తీసుకోలేదు.

2024లోనే ఈ పరిస్థితి ఉందంటే సమీప భవిష్యత్తులో పోలీసులు మరిన్ని క్యాంపులు ఏర్పాటుచేసి గెరిల్లా ప్రాం తాన్ని పూర్తిగా చుట్టుముట్టి, దాడులు కొనసాగిస్తాడనే అంచనాకు పార్టీ నాయకత్వం రాలేకపోయింది.కగార్ మొదలైనప్పటి 2024 జనవరి నుంచి 2025 అక్టోబర్ 7వ తేదీ వరకు పాత 200 క్యాంపులకు తోడుగా కొత్తగా ప్రభుత్వం మరో 100 క్యాంపులను ఏర్పాటుచేసింది.అనగా మూడు జిల్లాల ప్రాంతంలో మొత్తం 300 క్యాంపులు ఉన్న పరిస్థితుల్లో గెరిల్లా బలగాలు మనగలగడం కష్టమని పొ లిట్ బ్యూరో గుర్తించలేదు.ఈ తప్పిదమే తదుపరి పోలీసు బలగాలు క్రమంగా గెరిల్లా ప్రాంతాలను చుట్టుముడుతూ, ఒక్కో గ్రామాన్ని తమ స్వాధీనంలోకి తీసుకుంటూ విజృం భించడానికి దారితీసింది.అలా మారుమూల అడవుల్లోకి, మావోయిస్టు షెల్టర్ జోన్లలోకి చొచ్చుకురావడం,చుట్టుము ట్టడం, కార్డన్ సెర్చ్ చేసి మావోయిస్టు నాయకత్వాన్ని,బల గాలను,కేడర్లను నిర్మూలించడం జరిగింది.పార్టీ కార్యదర్శి బసవరాజ్ సహా పలువురు కేంద్ర కమిటీ సభ్యులు, ఇతర స్పెషల్ జోన్, డివిజన్, ఏరియా స్థాయి పార్టీ నేతలు, కేడరు, పీఎల్జీఏ కమాండర్లు,గెరిల్లాలు ఇలాంటి చుట్టివేత దాడుల్లో నే మరణించారు.



"భావోద్వేగం,ఉద్యమాభిమానం అర్థం చేసుకోగలం.కానీ దేవ్ జీతోసహా చివరి గెరిల్లానుకూడా మొత్తంగా నిర్మూలించేంతవరకు బయట ఉన్న మనందరం ఇలాగే భీకర ఓటములను తల్చుకుంటూ ఉందామా? పరిమిత ప్యాకెట్లలో ఉండి చేసే ఏ సాయుధ పోరాటమైనా బలమైన శత్రువు ముందు నిలబడదు అని 75 సంవత్సరాల క్రితం స్టాలిన్ చేసిన సూచనను కూడా అర్థం చేసుకోవాదం లేదు. దెబ్బతీయడం నుంచి దెబ్బ కాచుకునే స్థితికి ఉద్యమం చేరుకున్నదని నాయకత్వమే గత 15 సంవత్సరాలుగా సమీక్షించుకుంటూ వస్తున్నప్పటికీ దీనిపై నిర్ణయం తీసుకోవడంలో చోటు చేసుకున్న తాత్సారమే ఈ స్థితికి తీసుకువచ్చింది.ఇప్పుడిక ఏమున్నదని మనం బయట ఉంటూ కథలు,కవిత్వాలు,కాకరకాయలు రాసుకుంటూ అమరత్వ గానాలు చేసుకుంటా బతుకుదాం.రెండేళ్లుగా దండకారణ్యంలో ఉద్యమం ఎదుర్కొంటున్న ఘోరనష్టాల నుంచి నాయకత్వాన్ని,కార్యకర్తలను కాపాడుకునే మార్గం ఒక్కరంటే ఒక్కరు కూడా ఆలోచించడం లేదు.మనకళ్ల ముందే ఒక మహా ఉద్యమ చరిత్ర ముగిసిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి.ఇప్పుడేం చేయాలి.. లెనిన్ 120 సంవత్సరాల క్రితం వేసుకున్న ఆ గొప్ప తాత్విక ప్రశ్న ఇప్పుడు కొండలాగా నిలబడి ఉంది మనముందు.మిగిలి ఉన్న అతి కొద్ది మందిని కూడా రేపో మాపో తుదముట్టించినా ఎవరూ ఏం చేయలేని పరిస్థితి" అని మరో విప్లవోద్యమ అభిమాని తాజాగా సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు.

"సాయుధపోరాట పంథా వీడినప్పటికీ విప్లవ రాజకీయాలు పునాదిగా రాజ్యాంగ పరిధిలో ఎన్నికలను ఆశ్రయిస్తూ రాజకీయ పార్టీగా రూపాంతరం చెందాలనుకుంటున్న నిన్నటి సాయుధ విప్లవకారుల పార్టీ ఇప్పటి స్థితిలో మనగలుగుతుందా? నిరాయుధంగా ఉన్న ఆ నాయకత్వాలను వాళ్ల నిన్నటి శ్రేణులు తమ నాయకులుగా అంగీకరిస్తాయా? ఒకవేళ అంగీకరించినా ఇప్పటి రాజ్యాంగ పరిధిలో ఎన్నికల రాజకీయాలలో వాళ్ళు పాల్గొనదల్చినప్పుడు విశాల ప్రజానీకం,వయోజన ఓటర్లు వాళ్లను ఎన్నికల బరిలో గెలిపించగలరా? ఇప్పుడు అలాంటి ప్రత్యామ్నాయ పార్టీలు రాజకీయ పార్టీలుగా చెలామణి కాగలిగే స్థితి భారత రాజకీయ యవనికపై ఉందా?అలాంటి స్థితి లేదనే చెప్పాలి.ఇలాంటి కరాఖండి అభిప్రాయాన్ని అంగీకరించక పోయే వాళ్ళు ఉంటే ఉండొచ్చు గానీ భౌతిక స్థితి ఆయా మాజీ సాయుధ పంథా నాయకులను రాజకీయ నాయకులుగా అంగీకరించే అవకాశం లేదనే చెప్పాలి.భారత రాజకీయ వ్యవస్థలో సాయుధ పంథాను వీడి ఓట్ల రాజకీయాలను ఆశ్రయించిన పార్టీలు,నాయకులు ఊహించిన స్థాయిలో గెలిచిన దాఖలాలు లేవు.ఒక బీహార్ లో,ఒక ఝార్ఖండ్ లో, ఒక బెంగాల్ లో,ఒక కేరళలో వేళ్ల మీద లెక్కించగలిగే స్థాయిలో ప్రజా ప్రతినిధులుగా,ఎమ్మెల్యేలుగా,ఎంపీలుగా ఎన్నికవుతున్న నిన్నటి సాయుధ కమ్యూనిస్టుల తాలూకు వారసులు ఇప్పుడు కొత్తగా సాయుధ పంథాను వీడి కొత్త పార్టీ నెలకొల్పే నాయకులకు తమ తరహా విజయాన్ని అందించే దిశా నిర్దేశం చెయ్యగలరా"? అని మావోయిస్టు పార్టీ అర్బన్ అభిమాని ఒకరు పోస్టు చేశారు.

"ఆపరేషన్ కగార్‌ను అంచనా వేయడంలో జరిగిన ఘోర తప్పిదం మూలంగానే మావోయిస్టు పార్టీ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని నష్టాలను చవిచూసింది.ఆ పార్టీ కార్యదర్శి బసవరాజ్ సహా పలువురు సీసీ, ఎస్‌జెడ్సీ, డీవీసీ సభ్యులు, హిడ్మా సహా పీఎల్జీఏ బెటాలియన్, కంపెనీ, ప్లాటూన్ల కమాండర్లు, కీలక సభ్యులు చనిపోవడానికి పొలిట్‌బ్యూరో తీసుకున్న తప్పుడు నిర్ణయమే కారణమా? 2024 ఆగస్టులో విడుదల చేసిన సర్క్యులర్‌లో పార్టీ శ్రేణులకు, గెరిల్లా బలగాలకు సరైన వ్యూహం-ఎత్తుగడలను కనుక సూచించి ఉంటే ఇన్ని నష్టాలు జరిగేవి కావా? కగార్ దాడి తీవ్రతను పార్టీ, పీఎల్జీఏ నాయకత్వ కమిటీలు తక్కువ అంచనా వేయడం వల్లే నష్టాలు జరుగుతున్నాయని(2024 జనవరి నుంచి జులై కాలంలో) గుర్తించిన పొలిట్‌బ్యూరో.. కింది కమిటీలు చేసిన తప్పిదాన్నే తాను కూడా చేసిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి'' అని ఆయన అన్నారు.

## రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

## రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

# మహిళా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేర్చాలి
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గా రెడ్డి



**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 3:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ లో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులే రోల్ మోడల్ అని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, వారి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. జీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ,మూఢనమ్మకాలు, దురాచారాలు రాజ్యమేలుతున్న కాలంలో ఎన్నో అవమానాలు, కష్టాలను ఎదుర్కొని సమాజ మార్పు కోసం సావిత్రిబాయి పూలే, జ్యోతిబా పూలే కృషి చేశారని అన్నారు. సమాజాన్ని మార్చిన గొప్ప వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. జిల్లాలో పూలే భవనానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు.ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పదిమంది మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి గోవింద్ రామ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీరమ్య యాదవ్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణుగోపాల్, టీజీవో జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ, బీసీ సంఘాల ప్రతినిధులు మల్లికార్జున్ పాటిల్, ప్రభు గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమ్మక్క జాతరకు ముస్తాబవుతున్న వేదిక



**ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 3:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గోదావరి నది తీరంలో గౌతమేశ్వర ఆలయం సమీపంలో జనవరి 28,29,30 తేదీలలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో సమ్మక్క జరిగే ప్రదేశం ముస్తాబవుతోంది. ప్రతి రెండు యేండ్లకు ఒకసారి జరిగే సమ్మక్క జాతరకు ఈ ప్రాంతంలో లక్షలాదిమంది గోదావరి పుణ్య స్నానాలు ఆచరించి వనదేవతలకు పూజలు మొక్కులు చెల్లించుకుంటారు. సమ్మక్క చుట్టుప్రక్కల మున్సిపాలిటీ ఎండోమెంట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉత్సవాలు జరుపుకొనున్నారు. ఈనెల 6న టై బజార్ వేలం వేసి భక్తులకు పూజలకు తగిన సామాగ్రిని ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చొరవతో సమ్మక్క జాతర శాంటేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సమ్మక్క సారక్క జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోనున్నారు. భద్రత ఏర్పాట్లు, విద్యుత్తు, వైద్యం తదితర ఏర్పాట్లను ముమ్మరం చేయనున్నారు.

# తల్వేద వాగులో మహిళ దారుణ హత్య

- పరారీలో నిందితులు



**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 3:** జిల్లాలోని నందిపేట మండలం తల్వేద గ్రామ శివారులో గల వాగులో ఓ మహిళ మృత దేహం లభ్యం అయ్యింది. మహిళ తలపై కొట్టి వాగు లో పారవేసి వెళ్ళారు. శనివారం మహిళ మృతదేహం వాగులో కనిపించటంతో ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట్ మండలం కేంద్రం సుభాష్నగర్కు చెందిన రాగల గంగామణి(40) మృతదేహం వాగులో పడి ఉండగా అటుగా వెళ్తున్న కొందరు చూసి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతురాలి తలపై బలమైన గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలి కూతురు రాగాల మేఘన తన తల్లిని సుభాష్నగర్కు చెందిన స్వరూప, లావణ్య, ప్రేమల ఆమె భర్త నరేష్లు బాసర్కు తీసుకు వెళ్లామని తీసుకెళ్లి తలపై దారుణంగా కొట్టి చంపి వాగులో పడేసి ఉంటారని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా నిందితులు పరారీలో ఉండటంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. ఎస్సై శ్యాంరాజ్ హత్యకు దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



# పాత నేరస్తులను తనిఖీ చేసిన ఎస్పీ

**ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 3:** దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి గ్రామం, షాప్దీపూర్ తండాలో గతంలో దొంగతనాలకు పాల్పడిన సస్పెక్ట్ షీటర్లను జిల్లా ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారిని పాపిలాన్ డివైస్ ద్వారా వారిని అక్కడే చెక్ చేయడం జరిగింది. గతంలో వారు చేసిన దొంగతనాల వివరాలు, ప్రస్తుతం వారు ఏ పని చేస్తున్నారో, ఎలా జీవనం సాగిస్తున్నారో సస్పెక్ట్ తల్లిదండ్రులతో జిల్లా ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి పిల్లలపై షీట్లు ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిందో వివరించారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇకపై సత్ప్రవర్తనతో, ఎలాంటి నేరాలు చేయకుండా ఉంటే షీట్ తొలగించే అవకాశం ఉంటుందని సస్పెక్ట్ కు వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ తెలిపారు. షాప్దీపూర్ తండాలో అక్కడి యువకులతో మాట్లాడుతూ ఎవరు కూడా నేరప్రవృత్తి అలవర్చుకోకూడదని నేరలకు పాల్పడు వారిపై షీట్లు ఓపెన్ చేయబడతాయని హెచ్చరించారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు నివారించవచ్చని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువత మంచిగా చదువుకొని, క్రమశిక్షణతో జీవిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. అలాగే పిల్లలు ఏమిచ్చేస్తున్నారు అని తెలుసుకోవలసిన భాద్యత తల్లి తండ్రులపై ఉన్నదని తెలిపినారు. ఈ సస్పెక్ట్ తనిఖీ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు అందరూ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు

- ఓటర్ల జాబిత తయారీలో అధికారుల నిమగ్నం
- ఈ నెలా 10న తుది జాబితా

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 3:** నిజామాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని మూడు మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియ పనులు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, అడిషనల్ కమిషనర్ రవీంద్ర సాగర్ తో పాటు బోధన్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆర్మూర్ కమిషనర్ శ్రావణి, భీంగల్ మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్లు ఓటరు ముసాయిదా జాబితాను గత శుక్రవారం వెల్లడించారు. ఈ నెలా 5 నుంచి అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని ఈ నెలా 10న ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. గతంలో ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు కేంద్రంలో ఓట్లు వచ్చాయి. అలాంటివి ఇప్పుడు విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఉంటే వారు ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే అందిరికి ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా సవరణ చేయనున్నారు.




# క్రీడలతో మానసిక ఉల్లాసం

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- కాటారం డిఎస్పి సూర్యనారాయణ

**ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, జనవరి3:** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్నారు. శనివారం కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి యువకులతో మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దని ఒక్కసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆయన తెలిపారు. క్రీడలతో స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని యువతను సన్మార్గంలో నడిపించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ఆయన సూచించారు. విద్యతోపాటు క్రీడలు యువతకు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యతను అందిస్తాయని, విద్యార్థుల కోసం లైబ్రరీలో పుస్తకాలను ఏర్పాటు చేశామని వాటి ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ సర్పంచ్ హసీనాబాను, ఉప సర్పంచ్ శ్రీజ, సీఐ వెంకటేశ్వర్లు, మహదేవపూర్, కాళేశ్వరం, పలిమెల ఎస్సైలు పవన్ కుమార్, సాయి శశాంక్, తమాషా రెడ్డి, రమేష్, టీజీఎస్పీ ఆర్ఐ శ్రీధర్, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రసాద్, నరసయ్యలతో పాటు క్రీడాకారులు పలువురు పోలీస్ సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 3:** మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో వార్డు వారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని గుర్తించి, శిక్షణ తరగతుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. నోడల్ ఆఫీసర్లుగా నియమించబడ్డ అధికారులు తమతమ విధులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఆర్డీవోలు, నాలుగు మున్సిపాలిటీల అధికారులతో సమీక్షిస్తూ ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ( అర్బన్), వీధి కుక్కల నియంత్రణ, శానిటేషన్, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ , టాక్స్ కలెక్షన్ తదితర అంశాల పై రివ్యూ నిర్వహించి పురోగతి పై ఆరా తీశారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ మధు మోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, సీఈఓ చందర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ఆర్డీవోలు పార్థ సింహ రెడ్డి, వీణ, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపల్ కమిషనర్లు టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు,రెవెన్యూ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**టూరిజం అభివృద్ధి కోసం జాయింట్ సర్వే నిర్వహించాలి**

జుక్కల్ మండలం కౌలాస్ గ్రామంలో ఉన్న చారిత్రక కౌలాస్ కోట ముందు గల ప్రభుత్వ భూమిలో టూరిజం అభివృద్ధి చేపట్టేందుకు అవసరమైన స్థల పరిశీలన కోసం రెవెన్యూ , అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా (జాయింట్ సర్వే) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సంబంధిత భూమి పరిస్థితులు, ప్రభుత్వ భూమి హద్దులు, అటవీ పరిధి అంశాలను సమగ్రంగా పరిశీలించి, టూరిజం అభివృద్ధికి అనువైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.



### కొండగట్టులో డిప్యూటీ సీఎం పవన్

# పర్యటన బందోబస్తు పర్యవేక్షించిన సీపీ

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 3 :** జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాటును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పర్యవేక్షించారు. శనివారం పవన్ కళ్యాణ్ జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రానికి విచ్చేసి టీటీడీ నిధులతో నిర్మించనున్న మాలధార విరమణ భవనం శంకుస్థాపన చేశారు. ఈ పర్యటన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ బందోబస్తు ఏర్పాట్లలో జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితె, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం , మంచిర్యాల డీసీపీ భాస్కర్, నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వా రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 3:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించి విద్యా బోధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా ఉపాధ్యాయినులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వైవి గణేష్, డీఈవో గిరిరాజ్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం

- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- 4.17 లక్షలు పంచాయతీ నిధులు స్వాహా

**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, పెద్దపల్లి, జనవరి 3:** గ్రామ పంచాయతీ నిధులు పన్ను దుర్వినియోగం చేసినందుకు సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి కే. శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దిగుంట గ్రామంలో 202425 ఆర్థిక సంవత్సరానికి గాను 6 లక్షల 31 వేల 57 రూపాయల ఇంటి పన్ను వసూలు చేసి కేవలం 3 లక్షల 87 వేల 382 రూపాయలు మాత్రమే ఎస్.టి.ఓ లో దాఖలు చేశారని , మిగిలిన 2 లక్షల 43 వేల 675 రూపాయలు దుర్వినియోగం చేశారని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్ పై నవంబర్ 6న జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో విచారణ నిర్వహించగా 10 రోజులలో పెండింగ్ ఇంటి పన్ను చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ అంశంపై సుల్తానాబాద్ మండల పంచాయతీ అధికారి విచారణ నిర్వహించగా మల్టీ పర్పస్ వర్కర్ల జీతాల చెల్లింపు కోసం 2 లక్షల 56 వేల 500 రూపాయలు వసూలు చేసి 2 లక్షల 18 వేలు మాత్రమే చెల్లించారని , ఇక్కడ మరో 38 వేల 500 రూపాయల డబ్బులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస ఇంటి పన్ను డబ్బులు 2 లక్షల 43 వేల 675 రూపాయలు, మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలలో 38 వేల 500 రూపాయలు, టిఎస్ బీ పాస్ ఖాతా నుంచి మరో లక్ష 35 వేల రూపాయలు దాన్ని తిరస్కరించి మొత్తం 4 లక్షల 17 వేల 175 రూపాయలు నిబంధనలకు విరుద్ధంగా వాడుకున్నట్లు తేలిందని కలెక్టర్ పేర్కొన్నారు. 4 లక్షల 17 వేల 175 రూపాయలు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించిన పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేస్తూ, విచారణ ముగిసే వరకు హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.



# చిట్కుల్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 3 :** మహిళల సమానత్వం కోసం వారి అభ్యున్నతి కోసం ఉద్యమం చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని ఆయన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే మహిళలకు విద్యను సులభతరం చేసేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు.




# చైనా మాంజా వినియోగం నిషేధం

- వాడినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 3:** ప్రజల ప్రాణ రక్షణను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజా (నైలాన్ దారాలు) వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. చైనా మాంజా కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పక్షులు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో చైనా మాంజా నిల్వలపై దాడులు నిర్వహించి, నిషేధిత చైనా మాంజాను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి చైనా మాంజాను వాడినా లేదా అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ పిల్లలను చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండేలా ఉంచాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ, చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాల నుండి ప్రాణ భద్రతకు సహకరించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా వినియోగించినట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

“



సభకు రాని వ్యక్తి అజెండా డిసైడ్ చేస్తున్నారు. ఆయన ఇరిగేషన్‌పై చర్చిస్తారని చెప్పారు, కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరూ సభలో లేకుండా పోయారు. రెండు మూడు రోజుల నుంచి అసెంబ్లీలో కృష్ణా, గోదావరి తప్ప వేరే అంశాలపై చర్చించడం లేదు. ఇతర సమస్యలపైనా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి.

- ఎంఐఎం నేత అక్బరుద్దీన్

ప్రాంతీయం



## సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు
# ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

**ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 3:** సావిత్రి బాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం భూంపల్లి గ్రామం లో సావిత్రి భాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు సంఘసంస్కర్త, రచయిత్రి, సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకై ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆమె మార్గదర్శకత్వంలో ప్రపంచంలో అన్ని రంగాల్లో భారత మహిళలు పోటీ పడేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భూంపల్లి సర్పంచ్ రంగయ్య గారి జన్నారెడ్డి, ఉపసర్పంచ్ బాల్శెట్టి అనూష నందం, వార్డ్ సభ్యులు లక్ష్మి నర్సవ్వ ,మాధురి,ప్రవీణ్,శ్రీకాంత్,కొండల్,అనిల్,బాలరాజు,రంజిత్,రాజు గౌడ్,శ్రీధర్, అక్బరుపేట సర్పంచ్ మండల కుమార్,మోతే మాజీ సర్పంచ్ శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి ఉమారాణి బాలగౌడ్ బాలగౌడ్,ఉల్లెంగల నవ్యనరేష్,నాయకులు బోయ శ్రీనివాస్,బిఆర్ఎస్ నాయకులు,పూలే కమిటి సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళా విద్యను ముందుకు తీసుకెళ్లాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 3:** సావిత్రిబాయి పూలే ఆశయాల స్ఫూర్తితో మహిళా విద్యను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి పిలుపునిచ్చారు. సావిత్రి బాయి పూలే 195 జయంతి, మహిళ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన సావిత్రి బాయి పూలే 195 జయంతి ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రచోదన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వకాలం గురువులు ఏమి ఆశించకుండా విద్యను బోధించేవారు. ఇక్కడికి వచ్చిన మహిళలు అందరూ అమ్మలు మీ పిల్లలు చదువుకుంటే ఎంత గోపవారు కావాలని ఆశీర్వదిస్తారో మీ పాఠశాలలలో కూడా మీ దగ్గర విద్యను అభ్యసించే ప్రతి ఒక్క విద్యార్థి గొప్పవారు అయ్యేలా విద్యను బోధించాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయి చేరుకునేలా కృషి చెయ్యాలని తెలిపారు. మీరు బోధించే ప్రతి వ్యాక్యం విద్యార్థిని ఆలోచింపజేసేలా ఉండాలని తెలిపారు. మీ దగ్గర చదివిన పిల్లలు గొప్పవాళ్ళు అయితే ఆ సంతోషం ఎంతో సంతృప్తి కలుగుతుంది. సావిత్రి బాయి పూలే మహిళలకు ఉన్నత విద్యావంతులు కావాలని ఆనాటి మహిళలకు గల కట్టు బాట్లను ఛేదించి మహిళలు చదువుకుంటూనే వృద్ధిలోకి వస్తారని అనేక ఉద్యమాలు చేసి మహిళా విద్యకు ఎంతగానో కృషిచేశారు. వసుధైక కుటుంబం అనే భావన అనేది చాలా గొప్పది. మనం మన దగ్గర చదివే పిల్లలను ఒక కుటుంబ సభ్యుల వలె చూసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిరుపేద విద్యార్థులకు చిత్త శుద్ధితో వారికి చదువు, మెను ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని మీకు , పిల్లలకు మీకు ఎంతగానో ఆనందం కలుగుతుందని తెలిపారు. రాయడం, చదవడం అనేది మొదటి తరగతి నుండే వారికి ఏకాగ్రతగా ఆటల , పాటల రూపంలో పిల్లలకు బోధించాలి. పిల్లలతో ఆప్యాయంగా ఉపాధ్యాయులు మెలిగితే వారు చెప్పిందే వేదంలా ఇష్టం నేర్చుకుంటారని మీరు చెప్పే చదువు పిల్లలకు చదువు ఇష్టం కలిగేలా బోధన ఉండాలని తెలిపారు. పిల్లల పట్ల శ్రద్ధగా చదివించి మానసిక స్థైర్యాన్ని కలిగించి ఒక ధైర్యాన్ని నింపాలి. విద్యార్థులతో రోజు ఒక 15 నిముషాల శ్వాస మీద ధ్యాస సంబంధించినవి వ్యాయామాలు చేయించాలని వారి నిత్యజీవితంలో ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. అనంతరం పలువురు ఉత్తమ సేవలు అందించిన మహిళా ఏంఈఓలు మరియు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల సామాజిక విప్లవ జ్యోతి సావిత్రిబాయి పూలే

- ఎంఈఓ గజ్జల కనకరాజు

**ప్రతిపక్షం,దౌల్తాబాద్, జనవరి 3:** సామాజిక విప్లవ జ్యోతి సావిత్రిబాయి పూలేనని ఎంఈఓ గజ్జల కనకరాజు అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ కార్యాలయంలో అధికారుల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను గ్రామ సర్పంచ్ పంజ స్వామి, ఎంఈఓ గజ్జల కనకరాజు, మండల కాంప్లెక్స్ హెచ్ఎం అనిల్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలు, రజిత, జ్యోతి, రోజాలను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి నరసింహులు, రజిత, జ్యోతి, రోజా, సిఆర్పి రాజు, ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్, నాయకులు బొల్లి చంద్రం, దాసరి సత్తయ్య,కనకా రెడ్డి, బండి భాగ్య, బోయిని ప్రేమలత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

**ప్రతిపక్షం, అక్బర్ పేట-భూంల్లి, జనవరి3:** భూంపల్లి గ్రామానికి చెందిన అబ్బరమైన శ్రీలేఖ భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నది. సిద్దిపేట జిల్లా పరదిలో మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ లో టాప్ 2వ ర్యాంకు సాదించారు.దింతో ఆ పేద విద్యార్థిని ఇంకా భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలని,రాష్ట్రటాలెంట్ టెస్ట్ లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బహుజన మిత్రులు తెలిపారు. విద్యార్థిని స్వగృహంలో విద్యార్థిని శాలువాతో సత్కరించి, మెమోంటోను భోజనం మిత్రులు అందజేశారు. అలాగే విద్యార్థిని మరింత ఉన్నతంగా ఎదగడానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన మిత్రులతో పాటు, విద్యార్థిని తల్లితండ్రులు, దాసరి సంక్షేమ సంఘం యువకులు పాల్గొన్నారు.



## దుబ్బాక మున్సిపాలిటీలో
# గులాబీ జెండానే ఎగురుతుంది

- బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్

**ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 3:** దుబ్బాక మున్సిపాలిటీలో గులాబీ జెండానే ఎగురుతుందని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల రానున్న సందర్భంలో దుబ్బాక పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డుల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకొని మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో దుబ్బాక మున్సిపాలిటీకి గతంలో రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి, నూతన బస్టాండ్, వెయ్యికి పైగా డబుల్ బెడ్రూం ఇళ్లు, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కేసీఆర్ స్కూల్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ పాలనలోనే జరిగాయని చెప్పారు. ఇవన్నీ నేడు బీఆర్ఎస్ అభివృద్ధికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా దుబ్బాక మున్సిపాలిటీకి ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 కోట్ల నిధులను తిరిగి పంపి, మళ్లీ కొత్తగా మంజూరు చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రతినిధిగా ఉన్న దుబ్బాక ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ మాధనేని రఘునందన్ రావు కూడా కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడబోతుందనే నమ్మకంతో దుబ్బాక ప్రజలు బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# తప్పుల తడకగా మున్సిపల్ ఓటరు ముసాయిదా

- కమిషనర్ తక్షణమే తప్పులను సరి చేయాలి
- మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 3:** మెదక్ పట్టణంలో 32 వార్డుల ఓటరు లిస్టు డ్రాఫ్టు చేసి పొందుపర్చిన జాబితాలో తీవ్ర తప్పిదాలు ఉన్నాయని వాటిని సవరించాలని భారత రాష్ట్ర సమితి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ తాజా మాజీ కౌన్సిలర్లతో కలిసి శనివారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం ప్రచురించిన ఓటరు ముసాయిదా జాబితా లో పూర్తిగా తప్పులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వార్డుకు సంబంధించిన ఓటర్లు మరో వార్డులో రావడం జరిగింది. గతంలో డ్రాఫ్టు చేసిన విధంగా చేయడం లేదు. కార్యాలయ సిబ్బంది అధికారులు ఫీల్డ్ లోకి వెళ్ళి 2020 ఏ విధంగా ఉందో డోర్ టు డోర్ , క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ జరిపి జాబితాను సిద్ధం చేయాలని కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ న్యాయవాది జీవన్ రావు , మాజీ కౌన్సిలర్ లు అకిరెడ్డి కృష్ణ రెడ్డి , మామిళ్ళ ఆంజనేయులు, వంజరి జయరాజ్.గడ్డమీది కృష్ణ గౌడ్, సులోచన ప్రభు రెడ్డి, ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, శ్రీనివాస్, ఏనుగుల రాజు, నాయకులు మెడిశెట్టి శంకర్, గోపాల్, రుక్మ చారి, లక్ష్మణ్, మోహన్ తదితరులు ఉన్నారు.



## 35 శాతం దాటిందా
## జైలు, జరిమానా తప్పదు

**ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 3:** మద్యం సేవించి వాహనం నడిపిన వాహనదారులు పోలీసులకు పట్టుపడితే జైలు లేదా జరిమానా తప్పదని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బ్రీత్ ఎనలైజర్ తో చెక్ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు నిర్ధారణ అయితే జైలు లేదా జరిమానా తప్పదని అన్నారు. ఇందులో భాగంగానే శనివారం నాడు స్థానిక మెజిస్ట్రేట్ ముందు హాజరపరచగా ఒక్కొక్కరికి పదివేల నిర్మాణ తో పాటు మరికొందరికి జైలు శిక్ష విధించినట్లు మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్, ఏఎస్ఐ జగదీశ్వర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఐ పార్టీ చరిత్ర ఘనమైనది

- సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 3:** దేశంలో ప్రజా సమస్యల పై వందేళ్లుగా పోరాటాలు సాగించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)దని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో పోతిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి రైతాంగ, కార్మిక, పేదల హక్కుల కోసం సీపీఐ అనేక త్యాగాలు చేసిందని, దున్నేవాడికి భూమి నినాదంతో లక్షలాది ఎకరాల భూములను పేదలకు అందించిందని తెలిపారు. సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యాలతో సమ సమాజ స్థాపనే సీపీఐ ధ్యేయమని అన్నారు.సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు దేశ విదేశాల నుంచి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని, జనవరి 8 నుంచి జిల్లాలో ఐదు రోజుల పాటు ప్రచార జాత నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపె మల్లేష్,కనుకుంట్ల శంకర్ కొమ్ముల భాస్కర్,జాగీర్ సత్యనారాయణ, బట్టు దయానంద రెడ్డి, ఎడల వనేశ్, అందె అశోక్, కిష్టపురం లక్ష్మణ్, జేరిపోతుల జనార్ధన్,పిల్లి రజిని,జిల్లా కౌన్సిల్ సభ్యులు బన్సీలాల్,ఎస్కె హారిఫ్ మిట్టపల్లి సుధాకర్,బోనగిరి రూపేష్,శివలింగు కృష్ణ,సుదర్శన చారి,ఆది రంగారెడ్డి, స్వర్గం రాజేశం, సంగెం మధు, రామగళ్ల నరేష్, కర్ణాల చంద్రం, బంక రాజయ్య పాల్గొన్నారు.



# మహిళా సంఘాల బలోపేతానికి కృషి

**ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి3:** మహిళా సంఘాల బలోపేతానికి మహిళలు ఎంతగానో కృషి చేయాలని గ్రామ సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ బాలకిషన్ లు అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో గ్రామములో నూతనంగా గెలుపొందిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు మహిళా సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళల ద్వారా గ్రామం మరింత అభివృద్ధి చెందిందని సూచించారు ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు సునంద, భాగ్య, లక్ష్మి వెంకటలక్ష్మి,మమత,విజయ, అనసూయ, ముత్యాలు, మమత తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డిపల్లి పాఠశాలలో సావిత్రిబాపూలే జయంతి



**ప్రతిపక్షం, చేగుంట, జనవరి 3:** చదువుల తల్లి సావిత్రిబాపూలే జయంతి వేడుకలను చేగుంట మండలం రెడ్డిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాపూలే దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ భారత సంఘసంస్కర్తగా పేరుందిన సావిత్రిబాయి విద్యాపరంగా ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఆమెను భావితరాలకు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ చల్లా రామకృష్ణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి చేసి ఉత్తమ అవార్డులుసాధించాలి

- నూతన ఎస్సీ ఎస్టీ సర్పంచ్ లకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పిలుపు



**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి3:** గ్రామాలను అభివృద్ధి చేసి ఉత్తమ అవార్డు లు సాధించి సర్పంచ్ లు ప్రజల మన్ననలను పొందాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 195వ జయంతోత్సవం సందర్భంగా శనివారంనాడు రామయంపేట, నిజాంపేట సర్పంచ్ లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే,చిత్ర పటాంకు కమిషన్ చైర్మన్ పూల మాలలు వేశారు.అనంతరం సర్పంచ్ లను ,అధికారులను చైర్మన్ సన్మానించారు. ఈ సందర్ంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం నిధుల ద్వారా అంగన్ వాడి భవనాలు,పాఠశాలలకు ప్రహరి గొడలు,స్మశాన వాటికలు పల్లెపకృతి వనాల కొసం తీర్మానం చేసి యంపిడిఒ ద్వారా ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేసుకొవాలన్నారు.భారత దేశ మొట్టమొదటి మహిళ టిచర్ సావిత్రి బాయి పూలే బాటలో ప్రయాణించి గ్రామాలలో డ్రాపౌట్ లు లేకుండా పిల్లలందరు బడిలో వుండె విధంగాచూడలన్నారు.సర్పంచ్ లకు బాధ్యతలు ఎక్కువ అన్ని ప్రజాప్రతినిధులలో సర్పంచ్ లకే చెక్ పవర్ వుందని అధికారాలను ఉపయోగించుకొని బాధ్యతలను నెరవేర్చాలన్నారు. గ్రామాలలో అసమానతలు లేకుండా సమానత్వ గ్రామాలుగా మార్చాలన్నారు.ఈ కార్యక్రమం లో సింధు, లింగేశ్వర్, ఎస్సై రాజేష్, డి బివిఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, మాల మహానాడు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సామల అశోక్, డీబీఎఫ్ మండల అధ్యక్షులు బ్యాగరి చంద్రం, మండల కార్యదర్శి మనుబోతు నరేష్, వినోద్ నాయక్, శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్య సేవ కింద 2025 డిసెంబర్ వరకు 24,49,117 మందికి సేవలు అందాయి. గతంతో పోలిస్తే 21 శాతం వృద్ధి నమోదైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ కింద రూ. 11,577 ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం 19 నెలల్లోనే 6,530 కోట్లు ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఖర్చు చేసింది.

- ఏపీ మంత్రి సత్యకుమార్

# కాంగ్రెస్... టీవీకే పొత్తు?!

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 3:** ఈ ఏడాది జరుగునున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపే అవకాశాలున్నాయని నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం సంకేతాలు ఇచ్చింది. టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ, లౌకిక వాదం, మతత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటం విషయంలో కాంగ్రెస్‌టీవీకే విధానాలు ఒకేలా ఉంటాయని, ఆ పరంగా రెండు పార్టీలు సహజ భాగస్వాములని చెప్పారు. రాహుల్ గాంధీ, తమ నేత విజయ్ మంచి స్నేహితులని తెలిపారు.ఇరు పార్టీల మధ్య పొత్తుకు అవకాశాలున్నప్పటికీ ఒక అవగాహనకు వచ్చేముందు కొన్ని అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని ఫెలిక్స్ అన్నారు. ప్రస్తుత ప్రతిష్టంభనకు తమిళనాడు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. ఆ పార్టీ విభాగం నేతలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీవీకేతో చర్చలకు వెనుకంజ వేస్తున్నట్టు కనిపిస్తోందని అన్నారు. టీవీకే, కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటే మైనారిటీ, బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా కాపాడుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా, టీవీకేకాంగ్రెస్ పొత్తు పెట్టుకోవచ్చనే సంకేతాలు గత నెలలోనే కనిపించినట్టు చెబుతున్నారు. డిసెంబర్ 25న జరిగిన టీవీకే కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం ఈ వాదనకు బలం చేకూర్చింది. తమిళనాడులో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా 2024 అక్టోబర్‌లో టీవీకేను విజయ్ ప్రారంభించారు. అయితే టీవీకే ఎంట్రీతో తమకొచ్చే ముప్పు ఏదీ లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ధీమా వ్యక్తం చేస్తోంది.



## విశ్వ వీక్షణం



### భారీ పేలుళ్లతో దద్దరిల్లిన వెనెజువెలా..
# వీధుల్లోకి పరుగులు తీసిన జనం

అమెరికా, వెనెజువెలా దేశాల మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరాయి. తాజాగా భారీ పేలుళ్లతో వెనెజువెలా దద్దరిల్లింది. రాజధాని కరాకస్ లో పేలుళ్లు సంభవించాయి. శనివారం తెల్లవారుజామున దాదాపు ఏడు చోట్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. అంతేకాదు, కరాకస్‌పై తక్కువ ఎత్తులో విమానాలు గర్జించాయి. ఈ శబ్దాలతో స్థానికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వీధుల్లోకి పరుగులు తీశారు. నికోలస్ మదురో ప్రభుత్వాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే వెనిజువెలా చుట్టూ కరేబియన్ సముద్రంలో భారీ ఎత్తున సైన్యాన్ని మోహరించారు. ఇక మాదకద్రవ్యాల అక్రమ రవాణా విషయంలో కొంతకాలంగా వెనెజువెలాను అమెరికా టార్గెట్ చేసింది. పసిఫిక్, కరేబీయన్ సముద్రాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, ఆయిల్ ట్యాంకర్‌లు, జలాంతర్గాములపై దాడులు చేస్తోంది. ఈ పరిణామాల వేళ తాజా పేలుళ్లు చోటు చేసుకోవడం గమనార్హం.

**దాడులు చేసింది మేమే.. ట్రంప్ కీలక ప్రకటన**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. వెనెజువెలాపై దాడులు చేసింది తామే అని ప్రకటించారు. వెనెజువెలా , అధ్యక్షుడు నికోలస్ మదురోపై పెద్ద ఎత్తున దాడిని విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. నికోలస్‌తో పాటూ ఆయన భర్యాను అదుపులోకి తీసుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. వారిని వెనెజువెలా నుంచి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఈ దాడికి సంబంధించిన వివరాలు మార్ ఎ లాగోలో నిర్వహించే మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు ట్రంప్ తెలిపారు.నికోలస్ మదురో ప్రభుత్వాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే వెనెజువెలా చుట్టూ కరేబియన్ సముద్రంలో భారీ ఎత్తున సైన్యాన్ని మోహరించారు. ఇక మాదకద్రవ్యాల అక్రమ రవాణా విషయంలో కొంతకాలంగా వెనెజువెలాను అమెరికా టార్గెట్ చేసింది. పసిఫిక్, కరేబీయన్ సముద్రాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, ఆయిల్ ట్యాంకర్‌లు, జలాంతర్గాములపై దాడులు చేస్తోంది. ఈ పరిణామాల వేళ ఇవాళ ఉదయం భారీ పేలుళ్లతో వెనెజువెలా దద్దరిల్లింది. రాజధాని కరాకస్ లో పేలుళ్లు సంభవించాయి. శనివారం తెల్లవారుజామున దాదాపు ఏడు చోట్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. అంతేకాదు, కరాకస్‌పై తక్కువ ఎత్తులో విమానాలు గర్జించాయి. ఈ శబ్దాలతో స్థానికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వీధుల్లోకి పరుగులు తీశారు. ఈ నేపథ్యంలో ఈ దాడి చేసింది తామే అని ట్రంప్ ప్రకటించారు.


సింగిడి
హైదరాబాద్
ఆదివారం
04.01.2026

ప్రతిపక్షం
Prathipaksham.in




# మంచు కురిసే వేళలో.

**శీతాకాలపు అందాలు, మంచులో క్రీడలు, కొత్త అనుభూతిని పంచే విహారయాత్రలు, అద్భుతమైన మంచు ప్రకృతి దృశ్యాలను అందించే గమ్యస్థానాలు భారత్ లో చాలానే ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఈ సీజన్ లో చూడాల్సిన ఇలాంటి అందమైన ప్రదేశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**









మంచుతో కప్పబడిన పర్వతాలు, ఆహ్లాదకరమైన హిల్ స్టేషన్లు, ప్రశాంతమైన లోయలను అన్వేషించడానికి శీతాకాలం అద్భుతమైన సీజన్. మీరు మంచు అందాలను ఆస్వాదించగల ప్రాంతాలను చూడాలనుకుంటే మీకు ఫిబ్రవరి నెలలోకొన్ని ప్రాంతాలు అద్భుతమైన సరికొత్త అనుభూతిని పంచుతాయి. శీతాకాలపు క్రీడలు, చలి మంటల వేడి, అద్భుతమైన శీతాకాలపు దృశ్యాలలో చూడాలనుకునే వారికోసం ఇక్కడ కొన్ని అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. ఆ వివరాలు మీకోసం !

## మనాలి
### హిమాచల్ ప్రదేశ్

మనాలి భారతదేశంలోని శీతాకాలపు చాలా మందికి ఇష్టమైన ప్రదేశం, దాని అందమైన మంచుతో కప్పబడిన పర్వతాలు, శక్తివంతమైన స్థానిక సంస్కృతి, అనేక రకాల కార్యకలాపాలతోసందర్శకులను ఆకర్షిస్తుంది. పట్టణంతో పాటు దాని పరిసరాలు మంచుతో కప్పబడిన దుప్పటితో చుట్టబడి ఉన్నందున ఫిబ్రవరి వెళ్ళడానికి గొప్ప సమయం. మీరు సోలాంగ్ వ్యాలీలో స్కీయింగ్ చేయవచ్చు, పారాగ్లైడింగ్ ప్రయత్నించవచ్చు లేదా బియాస్ నదిలో అద్భుతమైన అనుభూతిని పొందవచ్చు.

## లేహ్ -లడఖ్
### జమ్మూ & కాశ్మీర్

లేహ్‌లడఖ్ శీతాకాలంలో సందర్శించడానికి అత్యంత శీతలమైన, అత్యంత ఉత్కంఠభరితమైన ప్రదేశాలలో ఒకటి. ఫిబ్రవరిలో ఈ ప్రాంతం లోతైన మంచుతో కప్పబడి, అద్భుతమైన శీతాకాలపు అద్భుతాన్ని సృష్టిస్తుంది. ఈ సమయంలో కొన్ని ప్రాంతాలు మూతపడినప్పటికీ ఇప్పటికీ ఘనీభవించిన పాంగోంగ్ సరస్సును సందర్శించవచ్చు, స్థానిక మఠాల దృశ్యాలు చూడవచ్చు. చల్లని ఎడారి, మంచు కలయిక నిజంగా అద్భుతమైన దృశ్యాలు కనులవిందు చేస్తాయి.

## సిమ్లా
### హిమాచల్ ప్రదేశ్

హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా చలికాలంలో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలకు సాక్షిగా నిలుస్తుంది. ఈ నగరం శీతాకాలపు అందంతోవలసల శోభను మిళితం చేస్తుంది. ఫిబ్రవరిలో, సిమ్లాలో తేలికపాటి హిమపాతం కనిపిస్తుంది. రిడ్జ్ రోడ్‌ను షికారు చేయడానికి లేదా వేడి చాయ్ తాగడానికి ఒక సుందరమైన ప్రదేశంగా మార్చింది. మీరు స్కీయింగ్ , టోబోగానింగ్‌కు ప్రసిద్ధి చెందిన కుఫ్రి, నరకంద వంటి సమీపంలోని ప్రదేశాలను కూడా సందర్శించవచ్చు. ఇక్కడ చారిత్రక భవనాలు, మంచుతోకప్పబడిన కొండలు, సమీపంలోని స్కీయింగ్ ప్రదేశాలు చూడటం కోసం మీరు ఇక్కడకు వెళ్లవచ్చు.

## ఔలి
### ఉత్తరాఖండ్

ఔలి ఉత్తరాఖండ్‌లో అద్భుతమైన.. అందమైన ప్రకృతి నిధి. దాని తాకని మంచు, నందా దేవి, హిమాలయ శిఖరాల అద్భుతమైన దృశ్యాలు మీకు కనులవిందు చేస్తాయి. భారతదేశంలోని ప్రీమియర్ స్కీ రిసార్ట్‌లలో ఒకటిగా, ఫిబ్రవరి ఇక్కడ స్కీయింగ్, స్నోబోర్డింగ్ కోసం అనువైన సమయం. అద్భుతమైన మంచుతో కప్పబడిన పర్వతాలు, సుందరమైన కేబుల్ కార్ రైడ్‌లు ఔలిని శీతాకాలంలో సందర్శించాల్సిన గొప్ప ప్రదేశాల్లో ఒకటిగా చేశాయి.

## నైనిటాల్
### ఉత్తరాఖండ్

భారతదేశంలోని "లేక్ డిస్ట్రిక్ట్" అని పిలువబడే నైనిటాల్ శీతాకాలంలో చాలా అందంగా ఉంటుంది. సరస్సులు, వలస జీవుల ఆకర్షణకు ప్రసిద్ధి చెందిన ఈ పట్టణం ఫిబ్రవరిలో మంచు దుప్పటి కప్పుకుని అందరినీ మంత్రముగ్ధులను చేస్తుంది. నైని సరస్సులో రొమాంటిక్ రైడ్‌ను ఆస్వాదించవచ్చు. మాల్ రోడ్‌లో షికారు చేయడం, మంచుతోకప్పబడిన శిఖరాల అద్భుతమైన దృశ్యాలు, స్నోవ్యూ పాయింట్ మీకో సరికొత్త అనుభూతిని పంచుతాయి.

## మున్సియరి
### ఉత్తరాఖండ్

ప్రశాంతమైన, ప్రత్యేకమైన గమ్యస్థానం కోసం వెతుకుతున్న వారికి, మున్సియరి ఒక అద్భుతమైన శీతాకాలపు ప్రదేశం. కుమావోన్ ప్రాంతంలో ఉన్న ఇది మంచుతో కప్పబడిన పర్వతాలు, సహజమైన అందాల మధ్య ప్రశాంతంగా ఉంటుంది. ఫిబ్రవరిలో ఈ ప్రాంతం సందర్శనకు అనువైనది. ఈ ప్రాంతం మంచుతో కప్పబడి ఉంటుంది, ప్రశాంతమైన ట్రెక్కింగ్, అద్భుతమైన పంచచూలి శిఖరాల చుట్టూ ప్రకృతి నడకలు జీవితంలో మరిచిపోలేని అనుభూతిని పంచుతాయి.



## గుల్మార్గ్
### జమ్మూ & కాశ్మీర్

**పువ్వుల పచ్చికభూమిగా గుర్తింపు పొందిన గుల్మార్గ్ శీతాకాలంలో మరీ ముఖ్యంగా ఫిబ్రవరిలో భూవిపై ఉన్న స్వర్గంగా మారుతుంది. పిర్ పంజాల్ పర్వత శ్రేణి మృదువైన, పొడి మంచు, ఉత్కంఠభరితమైన చూపుతిప్పకోనివ్వని దృశ్యాలు కొత్త అనుభూతిని పంచుతాయి. మీరు స్కీయింగ్ చేయడానికి ఆసక్తిగా ఉన్నా లేదా మంచులో ఆడాలనుకున్నా, గుల్‌మార్గ్ ప్రతిఒక్కరికీ అద్భుతమైన పర్యాటక ప్రాంతం. ఇక్కడ ప్రపంచంలోని అత్యంత ఎత్తైన కేబుల్ కార్లలో ఒకటైన గుల్‌మార్గ్ గొండోలా, మంచుతో కప్పబడిన లోయల అద్భుతమైన దృశ్యాలను చూపిస్తూ అఫర్వాట్ పర్వత శిఖరానికి మిమ్మల్ని తీసుకెళ్తుంది.**

## తవాంగ్
### అరుణాచల్ ప్రదేశ్

ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్, మంచు ఔత్సాహికులకు ఆకర్షణీయమైన ప్రదేశం. ఫిబ్రవరిలో పట్టణం మంచుతో కప్పబడి ఉంటుంది. ఇది శీతాకాలపు మాయాజాలాన్ని అనుభవించడానికి అద్భుతమైన ప్రదేశం. తవాంగ్ దాని అందమైన మఠాలకు ప్రసిద్ధి చెందింది. ఆకట్టుకునే తవాంగ్ మొనాస్టరీ, చుట్టూ మంచుతో కప్పబడిన పర్వతాలు ఒక సుందరమైన నేపథ్యాన్ని సృష్టిస్తాయి. ఇక్కడి మంచు పర్వతాలు, అందమైన మఠాలు, ఒక ప్రత్యేకమైన సాహసం కోసం ఈ ప్రాంతం సందర్శించవచ్చు.

# కాంగ్రెస్‌లో చేరిన తృణమూల్‌కు ఎంపీ మౌసమ్ నూర్ గుడ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కతా, జనవరి 3:** పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ మౌసమ్ నూర్ గుడ్ బై చెప్పారు. శనివారం కాంగ్రెస్ పార్టీలో ఆమె చేరారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు జైరామ్ రమేష్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్, పీసీసీ అధ్యక్షుడు శుభంకర్ సర్కార్ సమక్షంలో మౌసమ్ నూర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీ నేతలు ఆమెను కాంగ్రెస్‌లోకి తిరిగి స్వాగతించారు. కాగా, 46 ఏళ్ల మౌసమ్ నూర్ 2009 నుంచి 2019 వరకు కాంగ్రెస్ పార్టీ తరపున మాల్దా స్థానం నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత టీఎంసీలో చేరిన ఆమె రాజ్యసభకు ఎంపికయ్యారు. మరోవైపు మౌసమ్ నూర్ రాజ్యసభ గడువు ఏప్రిల్‌తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. త్వరలో జరుగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున మాల్దా నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తున్నది.



# వంద కోట్ల స్కామ్..
## మమత ప్రభుత్వంపై బీజేపీ ఆరోపణ

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కతా, జనవరి 3:** పశ్చిమ బెంగాల్ లో అధికార టీఎంసీపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. మమతా బెనర్జీ ప్రభుత్వం రూ.100 కోట్ల స్కాంకు పాల్పడిందని ఆరోపించింది. పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లాలో వరద బాధితులకు అందించాల్సిన సాయంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం రూ.100 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సోషల్ మీడియా వేదికగా బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు ఎక్స్ లో స్కాంకు సంబంధించి పలు వివరాల్ని బీజేపీ వెల్లడించింది. కోల్ కతా హైకోర్టుకు కాగ్ సమర్పించిన 700 పేజీల నివేదిక ఆధారంగా బీజేపీ ఈ ఆరోపణలు చేసింది. వరద బాధితులు ఇబ్బందులు పడుతుంటే, అధికార పార్టీ నాయకులు వారికి అందించాల్సిన సాయాన్ని దోచుకున్నారని విమర్శించింది.బీజేపీ చెబుతున్న కాగ్ నివేదిక ప్రకారం.. 6,965 మంది బాధితులు అనేకసార్లు వరద సాయం పేరిట నగదు పొందారు. కొందరి బ్యాంకు అకౌంట్లలోకి రెండు నుంచి 42 సార్లు వరద సాయం డబ్బులు క్రెడిట్ అయ్యాయి. అసలు నష్టమే జరగని కొన్ని నిర్మాణాల మరమ్మతులకు రూ.7.5 కోట్లు చెల్లించారు. ప్రభుత్వ వేతనాలు పొందుతున్న వారికి కూడా సాయం అందింది. వరద సాయం కోసం దరఖాస్తే చేయని మరికొందరికి కూడా డబ్బులు చెల్లించినట్లు ఆధారాలున్నాయి. టీఎంసీతో సంబంధం ఉన్న పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు దీని ద్వారా లబ్ది పొందారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయనే ఉద్దేశంతో దీనికి సంబంధించి పత్రాలు మాయం చేస్తున్నారని బీజేపీ అంటోంది. మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని లూటీ చేస్తోందని బీజేపీ విమర్శించింది. టీఎంసీ దీనికి సమాధానం చెప్పాలని, ఈ ఏడాది మమతను బెంగాల్ ప్రజలు ఇంటికి పంపిస్తారని కూడా బీజేపీ విమర్శించింది.



# ముంబైలో భారీ అగ్నిప్రమాదం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, జనవరి 3:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అంధేరిలోని 18 అంతస్తుల నివాస భవనంలో మంటలు చెలరేగాయి. అంధేరి సబ్వే ఎదురుగా ఉన్న ఎస్ వీ రోడ్‌లోని చండివాలా పెర్ల్ రీజెన్సీలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. మంటలు ఎగసిపడుతుండటంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భవనంలో చిక్కుకున్న నివాసితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.










## న్యూజీలాండ్ సిరీస్‌కు భారత జట్టు ఖరారు

టీ20 ప్రపంచ కప్ 2026కి ముందు టీమిండియా న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. జనవరి 11 నుంచి స్వదేశంలోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచ కప్‌నకు సంబంధించి ఇప్పటికే బీసీసీఐ జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వన్డే సిరీస్‌కు మాత్రం కాస్త సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు శనివారం బీసీసీఐ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సంబంధించి టీమిండియా జట్టును ప్రకటించింది. భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటెన్సివ్ రిహాబ్ బ్లాక్‌ను శ్రేయస్ పూర్తిచేసుకున్నాడు. గతేడాది అక్టోబర్ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో క్యాచ్ అందుకునే క్రమంలో శ్రేయస్‌కు తీవ్రమైన గాయమైంది. దీంతో తర్వాత జరిగిన మ్యాచ్‌లకు అయ్యర్ దూరమయ్యాడు. శ్రేయస్.. స్ట్రెంత్ అండ్ కండీషనింగ్‌లో పురోగతి సాధించాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో నాలుగు సెషన్లపాటు కఠినమైన సాధన పూర్తి చేశాడు. మ్యాచ్ సిమ్యులేషన్ సెషన్స్‌లోనూ పాల్గొన్నాడు. దీంతో జట్టులో చోటు దక్కించుకున్నాడు. షమీకి మాత్రం మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల దేశవాళీల్లో ఆకట్టుకున్న షమీకి చోటు దక్కుతుందని అంతా భావించారు. కానీ సెలక్టర్లు అతడిని ఎంపిక చేయలేదు.

**భారత తుది జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, జడేజా, సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

## ఒకే ఓవర్‌లో 34 రన్స్

**పాండ్యా విధ్వంసకర బ్యాటింగ్**

భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి రెచ్చిపోయాడు. ఈమధ్యే దక్షిణాఫ్రికాపై మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన పాండ్యా.. విజయ్ హజారే ట్రోఫీ లోనూ పూనకం వచ్చినట్లు చెలరేగాడు. లిస్ట్ - ఏ క్రికెట్‌లో విధ్వంసక ఆటతో మొట్టమొదటి సెంచరీ బాదేశాడీ హిట్టర్. బరోడా తరఫున బరిలోకి దిగిన ఈ చిచ్చరపిడుగు విదర్భ బౌలర్లకూ చుక్కలు చూపిస్తూ 68 బంతుల్లోనే శతక గర్జన చేశాడు. హిట్టర్లందు హార్దిక్ పాండ్యా వేరయా అనే మాట మనకు తెలిసిందే. ముఖ్యంగా టీ20లు అంటే చాలు తనలోని విధ్వంసక ఆటగాడిని బయటకు తీసుకొస్తాడీ క్రికెటర్. ఆసియా కప్ తర్వాత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో పునరాగమనం చేసిన అతడు వస్తూ వస్తూనే అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. అనంతరం సఫారీలకు తన బ్యాట్ పవర్ చూపించిన పాండ్యా.. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఊచకోత కోశాడు. విదర్భ బౌలర్లను హడలెత్తించిన బరోడా స్టార్.. స్పిన్నర్ రేఖాడే వేసిన 39వ ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. వరుసగా 6, 6, 6, 6, 6, 4 బాది 34 రన్స్ పిండుకున్నాడు. బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా విధ్వంసం సృష్టించిన పాండ్యా 68 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. లిస్ట్ - ఏ క్రికెట్‌లో అతడికిది తొలి శతకం కావడం విశేషం.



## భద్రత నడుమ సిడ్నీ టెస్టు

యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాఇంగ్లండ్ మధ్య ఆదివారం సిడ్నీ వేదికగా ఐదో టెస్టు ప్రారంభం కానుంది. ఇటీవలే బోండీ బీచ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిడ్నీ మైదానం లోపల, వెలుపల భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, సాయుధులైన పోలీసులు గస్తీ కాస్తారని న్యూసౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ మాల్ లాన్యోన్ శనివారం తెలిపారు. మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు జరిగిన నేపథ్యంలో తీసుకున్న పటిష్ట చర్యలనే సిడ్నీలోనూ కొనసాగించనున్నారు. పోలీసులు మైదానంతో పాటు, సమీపంలో పార్క్, రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. గతేడాది డిసెంబర్ 14న ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులు జరిపి 15 మంది మృతికి కారణమైన ఉగ్రవాది నవీద్ అక్రమ్‌పై పోలీసులు 59 అభియోగాలను నమోదు చేశారు. అందులో 15 హత్య కేసులున్నాయి. మరో ఉగ్రవాది సాజిద్ హతం కావడంతో నవీద్ ఒక్కడి పైనే ఈ అభియోగాలను పోలీసులు మోపిన విషయం తెలిసిందే. చనిపోయిన ప్రతిఒక్కరి హత్యకు కారణమంటూ పోలీసులు విడివిడిగా అతడి పై 15 కేసులు నమోదు చేశారు. కాల్పులకు సంబంధించి 40 కేసులు పెట్టారు. పేలుడు పదార్థాలు తదితర నేరాలపై మరో నాలుగు కేసులు నమోదు చేశారు. అయిదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ప్రస్తుతం 31 ఆధిక్యంలో ఉంది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. చివరి మ్యాచ్‌లోనూ గెలిచి.. సిరీస్‌ను విజయంతో ముగించాలని ఆ జట్టు చూస్తోంది. నాలుగో టెస్ట్ రెండు రోజుల్లోనే ముగిసిన నేపథ్యంలో అయిదో మ్యాచ్ జరగనున్న సిడ్నీలో పిచ్ ఎలా స్పందిస్తుందోనని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది



## న్యూజీలాండ్ సిరీస్‌లోనూ నిరాశే

ఒకప్పుడు భారత జట్టు ప్రధాన పేస్ అస్త్రమైన పేసర్ మహమ్మద్ షమీకి మరోసారి చుక్కెదురైంది. దేశవాళీ క్రికెట్‌లో వికెట్లు తీస్తూ నిలకడగా రాణిస్తున్నా సరే అతడిని సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు శనివారం ఎంపిక చేసిన స్క్వాడ్‌లో ఈ స్పీడ్‌స్టర్ పేరు లేదు. జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో షమీకి చోటు దక్కుతుందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం మరోసారి ఈ దిగ్గజ బౌలర్‌కు అన్యాయం చేశారు. దాంతో.. ఇక అతడి కెరీర్ ముగిసిందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఒకప్పుడు ప్రధాన పేసర్‌గా టీమిండియా విజయాల్లో కీలకమైన షమీ ఇప్పుడు ఒక్క ఛాన్స్ కోసం చకోర పక్షిలా నిరీక్షిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్న ఈ వెటరన్ బౌలర్.. జట్టుకు దూరమై రెండేళ్లు అవుతోంది. మోకాలి సర్జరీ నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన షమీకి సెలెక్టర్లు చుక్కలు చూపిస్తున్నారు.ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో ఐదు మ్యాచుల్లో 12 వికెట్లతో చెలరేగాడీ స్పీడ్‌స్టర్. దాంతో.. ఐసీసీ టోర్నీల్లో నిప్పులు చెరిగే షమీని వన్డే ప్రపంచకప్ కోసమైనా న్యూజిలాండ్ సిరీస్‌కు ఎంపిక చేస్తాడని ఊహించారంతా. కానీ, బుమ్రా బదులు సిరాజ్‌కు ఓటేసిన సెలెక్టర్లు హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లను తీసుకున్నారు. అంతే.. ఈసారైనా టీమిండియాకు ఆడే అవకాశం వస్తుందని భావించిన షమీ కలలు కల్లలయ్యాయి.





## మెగా ఫ్యాన్స్‌కి పండగే!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సక్సెస్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు అనిల్ రావిపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తుండటంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక చిరంజీవి సరసన స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తుండటం సినిమాకు మరింత క్రేజ్ తెచ్చింది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను జనవరి 4న తిరుపతిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ట్రైలర్ రన్‌టైమ్‌పై చిత్ర యూనిట్ స్పష్టత ఇచ్చింది. ఈ ట్రైలర్ మొత్తం 2 నిమిషాల 30 సెకన్లు ఉండనుందని దర్శకుడు అనిల్ రావిపూడి ఎడిట్ రూమ్ నుంచి ఓ ఫోటోను షేర్ చేస్తూ వెల్లడించారు. దీంతో అభిమానుల్లో ట్రైలర్‌పై ఆసక్తి మరింత పెరిగింది. చిరంజీవిని పూర్తిగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గర చేసే పాత్రలో ఈ సినిమా రూపొందుతున్నట్టు ఇప్పటికే లీకైన అప్డేట్స్ ద్వారా తెలుస్తోంది. అనిల్ రావిపూడి మార్క్ హ్యూమర్, ఎమోషన్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ మిక్స్ చేసి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని టాక్. ట్రైలర్‌లో చిరంజీవి టైమింగ్, డైలాగ్ డెలివరీ హైలైట్‌గా నిలవనున్నాయనే అంచనాలు ఉన్నాయి. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనిపించనుండటం మరో పెద్ద ఆకర్షణగా మారింది. అలాగే కేథరీన్ ట్రెసా, సచిన్ ఖేడేకర్, హర్షవర్ధన్, అభినవ్ గోమటం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చుతుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. సంక్రాంతి సీజన్‌లో విడుదల కానున్న ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక జనవరి 4న విడుదల కానున్న ట్రైలర్ సినిమాపై ఉన్న అంచనాలను ఏ స్థాయికి తీసుకెళ్తుందో చూడాలి. చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్ మెగాస్టార్ ఫ్యాన్స్‌కు పండగ ట్రీట్‌గా నిలుస్తుందా లేదా అన్నది తేలనుంది.



## #తలైవర్173

### త్వరలో షూటింగ్ ప్రారంభం

రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ #తలైవర్173 మాగ్నమ్ ఓపస్ కు దర్శకుడిని అనౌన్స్ చేసింది. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్ లో వచ్చే ఈ చిత్రానికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తారు. ఇది నెక్స్ట్ లెవల్ సినిమాటిక్ గ్రాండియర్ గా వుండబోతోంది. రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మాణంలో #తలైవర్173 రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ లెగసీని గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకోనుంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం మాస్ అప్పీల్, ఎమోషన్, హై క్యాలిటీ మేకింగ్ తో ప్రేక్షకులని అలరించబోతోంది. ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. త్వరలోనే తారాగణం, టెక్నికల్ టీం గురించి మరిన్ని వివరాలను రివిల్ చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా #తలైవర్173, 2027 పొంగల్ సందర్భంగా థియేటర్లలో విడుదల కానుంది. సూపర్ స్టార్ పవర్, ఎంటర్టైన్మెంట్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రం పర్ఫెక్ట్ సినిమాటిక్ ఎక్స్ అందించనుంది.



## 'హైందవ'

### బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

'కిష్కింధపురి'తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం అకల్ట్ థ్రిల్లర్ 'హైందవ' లో నటిస్తున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. గత నెలలో మారేడుమిల్లిలో జరిగిన ఒక కీలకమైన షూటింగ్ షెడ్యూల్ తర్వాత, చిత్ర బృందం ఇప్పుడు తమ నాల్గవ మెయిన్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్ర నిర్మాతలు ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఫెరోషియస్ మాస్ లుక్‌లో ఉన్న సాయి శ్రీనివాస్ సగం నీటిలో మునిగి ఉన్న ఒక పురాతన కట్టడంపై నిలబడి, అతని శరీరం నీటితో తడిసి, రక్తపు మరకలతో కనిపించడం ఆసక్తికరంగా వుంది. ఒక చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలిని పట్టుకుని, మరో చేతిలో మండుతున్న ముసుగు, అతని వెనుక మెరిసే కళ్ళు భారీ కోరలతో ఉన్న ఒక పెద్ద వరాహం కనిపించడం ఇంటెన్సిటీని మరింత పెంచింది. సినిమా నిర్మాణంలో 70% పూర్తయిందని నిర్మాతలు తెలియజేశారు. ఇప్పటివరకు జరిగిన షూటింగ్‌లో ఎక్కువ భాగం కథలోని మిస్టరీని, డ్రామాటిక్ టెన్షన్‌ను బలంగా నిలబెట్టే కీలక సన్నివేశాలకు కేటాయించారు. ఈ సినిమా కథ శతాబ్దాల నాటి దశావతార ఆలయం చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన సంయుక్త కథానాయికగా నటిస్తోంది. మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జెడి చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను వంటి నటీనటులు ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

## 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'

**రెబెకా పాత్రలో తారా సుతారియా**

రాకింగ్ స్టార్ యష్ ప్రెస్టీజియస్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'పై రోజు రోజుకీ అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈసినిమా నుంచి నాడియా పాత్రలో నటిస్తోన్న కియారా అద్వానీ.. మిస్టీరియస్, గ్లామరస్ ఎలిజిబెత్ పాత్రలో నటిస్తోన్న హుమా ఖురేషి.. పవర్ఫుల్ గంగ పాత్రలో నటిస్తోన్న నయనతార పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదలై టాక్సిక్ సినిమాలోని డార్క్ వరల్డ్‌పై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచేశాయి. తాజాగా మేకర్స్ అందమైన, ఆకర్షణీయమైన, సున్నితమైన రెబెకా పాత్రలో నటిస్తోన్న తారా సుతారియా పాత్రను పరిచయం చేశారు. ఇలా సినిమాలోని పాత్రలను పరిచయం చేయటం ద్వారా.. సినిమా స్కేల్ పాన్ ఇండియా రేంజ్‌ను తెలియజేస్తోంది. ఇందులో హై యాక్షన్ సీక్వెన్సెస్, భారీ డ్రామా, కథలోని అనేక మలుపులుండబోతున్నాయి. తాజాగా తారా సుతారియా లుక్‌ను రివీల్ చేశారు. ఇది ఆమెకు తొలి పాన్ ఇండియా మూవీ. ఆమె కెరీర్‌లో ఇదొక కొత్త అధ్యాయం. అందంగా, స్టైల్‌గా కనిపిస్తూనే రెబెకా పాత్రలోని తారా సుతారియా గన్స్‌ను ఉపయోగిస్తోన్న తీరు ఆకట్టుకుంటోంది. పోస్టర్ చూస్తుంటే తనను తాను రక్షించుకోగల ధైర్యం, సామర్థ్యమున్న పాత్రలో ఆమె మెప్పించనుంది. అందమైన అమ్మాయిగా టాక్సిక్ అనే ప్రమాదకరమైన, కఠినమైన ప్రపంచంలోకి అడుగు పెడుతుంది.





## 'టైసన్ నాయుడు'

### పోస్టర్ రిలీజ్

యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. శనివారం బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తుపాకీని పట్టుకొని, శత్రువుల వైపు గురిపెట్టి నిల్చున్న ఈ పోస్టర్ అదిరిపోయింది. అతని ఇంటెన్సిటీ, మజిల్ ఫిజిక్, నెక్స్ట్ లెవల్ యాక్షన్ ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఈ పోస్టర్ కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.


Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200